నేటి కందం- నేటికి అందం

తీరుగ నమరావతిలో
ఫోరెన్సిక్ ప్రయోగశాల పొలుపాడు రీతిన్
వారిజ నయనుని దయతో
సారాంశము గల ప్రకటన సంజయ్ చేసెన్ !!

(అమరావతిలో ఫోరెన్సిక్ ల్యాబ్ ను ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

మాట్లాడే మన భాషనే
మనసులను కరిగిస్తది
మతితప్పితే కొ్రాయిలా
మనుషులను మరిగిస్తది
అధికారం ప్రతిపక్షం
అందరికిది వర్తిస్తది
అహంతోని విస్మరిస్తే
అపకీర్తిగా నర్తిస్తది


చురక




-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 21-3-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:172 పేజీలు:6 వెల: రూ.1/-


## రియాద్‌పై ఇరాన్ మిస్సైల్ దాడి.. భారతీయుడు మృతి.. కువైట్ ఆయిల్ రిఫైనరీపై ఇరాన్ డ్రోన్





న్యూఢిల్లీ, మార్చి 20:గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. సౌదీ అరేబియాలోని రియాద్ పట్టణంపై ఇరాన్ జరిపిన మిస్సైల్ దాడిలో భారతీయుడు మరణించాడు. ఈ విషయాన్ని సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయం శుక్రవారం ధృవీకరించింది. ఈ నెల 18న రియాద్ పట్టణంపై ఇరాన్ మిస్సైల్ దాడి చేసింది. ఈ దాడిలో ఒక భారతీయుడు మరణించాడని తమకు గురువారం రాత్రి సమాచారం అందినట్లు ఇండియన్ ఎంబసీ ప్రకటించింది.

ఇటీవల ఇరాన్ దాడుల్లో గల్ఫ్ దేశాల్లో మరణించిన భారతీయుల సంఖ్య 6కు చేరింది. తాజాగా మరణించిన భారతీయుడికి సంబంధించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు రాయబార కార్యాలయం తెలిపింది. ఈ అంశంపై అక్కడి భారత రాయబారి మహాజన్ స్పందించారు. మృతుడి కుటుంబానికి సానుభూతి తెలుపుతున్నామని, వారికి తగినంత సాయం అందిస్తామని, మృతదేహాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు. అలాగే ఇటీవల ఎమ్‌టీ సేఫ్ సీ విష్ణు ఆయిల్ ట్యాంకర్ నుంచి 15 మంది భారత సిబ్బందిని రక్షించామని, వారు శుక్రవారం ఇండియా చేరుకుంటారని కూడా ఆయన తెలిపారు. మరోవైపు గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా కువైట్‌లోని కీలక చమురు క్షేత్రాలపై ఇరాన్ దాడి చేసింది.

అక్కడి మినా అల్ అహ్మదీ రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. ఈ పేలుడుకు భారీగా మంటలు వ్యాపించాయి. ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణనష్టం లేదని కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు. ఇటీవల గల్ఫ్ దేశాల్లోని చమురు కేంద్రాల్ని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ చేస్తున్న దాడులతో భారీ నష్టమే జరిగింది. ముఖ్యంగా ఆయా దేశాల్లో చమురు ఉత్పత్తి తిరిగి సాధారణ స్థితికి చేరుకోవడానికి ఆరు నెలల సమయం పడుతుందని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ చీఫ్ ఫాతి బిరోల్ అన్నారు.

## బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట

హైదరాబాద్, మార్చి 20:2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర బడ్జెట్ ను తెలంగాణ డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. రూ 3,24,234 కోట్లతో భారీ బడ్జెట్ ను ఆయన ప్రవేశపెట్టారు. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని మల్లు భట్టి తెలిపారు. అటు సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే ఇటు మౌలిక వసతుల కల్పన ద్వారా దీర్ఘకాలిక అభివృద్ధికి బాటలు వేయడం ఈ బడ్జెట్ లోని ప్రధానాంశం కావడం విశేషం. శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.



### 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ పూర్తి వివరాలు

మొత్తం బడ్జెట్ 3,24,234

1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు

జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటన

ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం

ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు

ఐటీఐ, ఏటీసీల్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకారవేతనం

రూ.73,383 కోట్ల కొత్త రుణాలకు ప్రతిపాదన

వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు

విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు

ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు

పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు

విద్యా శాఖకు రూ.26,674 కోట్లు

రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు

చేయూత పథకం.. రూ.14,861 కోట్లు

వైద్య శాఖకు రూ.13,679 కోట్లు

ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు

ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు

బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు

మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు

మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు

కల్యాణ లక్ష్మీ పథకం.. రూ.3,683 కోట్లు

ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు

రాజీవ్ ఆరోగ్యశ్రీ.. రూ.1143 కోట్లు

గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు

వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్.. రూ.3500 కోట్లు



మహాలక్ష్మీ పథకం.. రూ.4,305 కోట్లు

ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు

పర్యాటక రంగానికి రూ.1,224 కోట్లు

యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు

మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు

ఉస్మానియా యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్లు

మెట్రో రైలు ఫేజ్-2.. రూ.600 కోట్లు

మహాలక్ష్మీ గ్యాస్ సబ్సిడీ పథకం.. రూ.723 కోట్లు

పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు

కార్మిక శాఖకు రూ.998 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్ సమావేశంలో నూతన పథకాలను ప్రవేశ పెట్టింది. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, జూన్ 2 నుంచి అమలు కానుంది. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం కూడా ప్రకటించింది. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డులను మంజూర్ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## పది పరీక్షలపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం

హైదరాబాద్, మార్చి 20 : పదో తరగతి పరీక్షలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. 'ఇకపై పదో తరగతి పరీక్షలు లేనట్లే'నని చెప్పారు. ప్రస్తుతం.. దేశమంతా +2 విధానం అమల్లో ఉందని ప్రస్తావించారు. తమది వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బడ్జెట్ అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఈరోజు(శుక్రవారం) చిట్‌చాట్ చేశారు.



ఫార్ముూలా ఈ-కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో చట్టప్రకారమే ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాము తొందరపడితే టెక్నికల్ రీజన్స్‌తో కోర్టు తిరస్కరించే ప్రమాదముందని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో న్యాయస్థానంలో ఊరట లభించలేదన్నారు. చక్రధర్ గౌడ్.. హరీశ్ రావుపై పెట్టిన ఫోన్ ట్యాపింగ్, వేధింపుల కేసులో ఆయనకు రిలీఫ్ లభించిందని ప్రస్తావించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో తనను విచారణకు రమ్మని నోటీసులిస్తే హాజరవుతానని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో విచారణ పూర్తి కాకుండా చర్యలు తీసుకోలేమని అన్నారు. కేసీఆర్ బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారని ఆరోపించారు. తెలంగాణ జాతిపిత ఎవరో ప్రజలు డిసైడ్ చేయాలన్నారు.

### గ్యారంటీలపై ఓ ప్రణాళిక ఉంది..

ఏ గ్యారంటీ ఎప్పుడు అమలు చేయాలో తమ దగ్గర ప్రణాళిక ఉందని సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. కేసీఆర్ హయాంలో అప్పులు, తప్పులు కప్పిపుచ్చి పాలన చేశారని ఎద్దేవా చేశారు. ఆ తప్పులు తాము చేయలేమన్నారు.

తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.3.47లక్షల కోట్ల అప్పులు చేశామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులను తీర్చేందుకే తామీ అప్పులు చేయాల్సి వచ్చిందని ప్రస్తావించారు. ఈ 26 నెలల్లో రూ.3.3 లక్షల కోట్లు కేసీఆర్ హయాంలో చేసిన అప్పుల్నే తమ ప్రభుత్వం తీర్చిందని చెప్పుకొచ్చారు. ఒక్క ఎకరాకు నీరు ఇవ్వకపోయినా రూ.44 వేల కోట్ల కాళేశ్వరంపై అప్పు తీర్చామన్నారు. హిల్ట్ టీడీఆర్ భూ బదలాయింపులపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఏ విచారణ కోరినా చేపట్టేందుకు సిద్ధమని స్పష్టం చేశారు సీఎం.

### ఆ భూములు అమ్మితే లక్ష కోట్లు రావు..

ఇండస్ట్రీకు చెందిన మొత్తం భూములు అమ్మినా లక్ష కోట్ల రూపాయలు రావని ముఖ్యమంత్రి తెలిపారు. హిల్టులో ఐదు లక్షల కోట్ల రూపాయల అవినీతి ఎలా జరిగిందని ప్రశ్నించారు. మంత్రి అజారుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీ కోసం సుప్రీంకోర్టు సూచన మేరకు తెలంగాణ గవర్నర్‌ను సంప్రదిస్తామని తెలిపారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను తొలగించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని అన్నారు. ఇప్పుడున్న జిల్లాలు మండలాల్లో ప్రస్తుతం ఎలాంటి మార్పులూ ఉండవని ఆయన స్పష్టం చేశారు. విద్యాశాఖ కమిషన్ ఇచ్చిన రిపోర్టును కేకే కమిటీకి రిఫర్ చేశామని పేర్కొన్నారు.

## బడ్జెట్‌లో జర్నలిస్టులకు మొండి చేయి.. హెల్త్‌కార్డులు రద్దు చేసినట్లేనా .. : టీయూడబ్ల్యూజే ఆరోపణ

హైదరాబాద్, మార్చి 20: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో జర్నలిస్టులకు మొండి చేయి చూపిందని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ , ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ ఆరోపించారు. బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమ నిధి, ఇళ్ల స్థలాలు, హెల్త్ స్కీమ్ ముచ్చట అసలే లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

జర్నలిస్టులకు గత ప్రభుత్వంలో కంటే తాము అధికంగా సంక్షేమం కోసం నిధులు కేటాస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జర్నలిస్టులను పూర్తిగా విస్మరించారని దుయ్యబట్టారు. గత ఎన్నికల మ్యానిపెస్టోలో అదనంగా 100 కోట్లు సంక్షేమ నిధిని కేటాయిస్థానని చెప్పి ప్రస్తుత బడ్జెట్‌లో కూడా చిల్లిగవ్వ కేటాయించకపోవడం అన్యాయం అన్నారు.

ఇళ్ల స్థలాల ప్రస్తావన చేయకపోవడం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని జర్నలిస్టుల సంఘాల నాయకులు పలుమార్లు కోరినా హెల్త్ కార్డు సంబంధించిన అంశమే బడ్జెట్ ప్రసంగంలో లేక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ తీరును పరిశీలిస్తే జర్నలిస్టులకు ఆరోగ్య భద్రతను అందించే జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌ను ఈ ప్రభుత్వం శాశ్వతంగా రద్దు చేసిందా అనే అనుమానం కలుగుతుందన్నారు.

ఇది తెలంగాణ జర్నలిస్టులకు పూర్తిగా అన్యాయం చేసిన బడ్జెట్‌గా తాము భావిస్తున్నట్లు ప్రకటించారు. ఈ బడ్జెట్‌పై తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్, టీయూడబ్ల్యూజె కోశాధికారి యోగానంద్ బడ్జెట్ పై అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ.. ఇజ్రాయెల్ దాడిలో ఐఆర్‌జీసీ ప్రతినిధి అలీ మొహమ్మద్ మృతి



న్యూఢిల్లీ, మార్చి 20:ఇజ్రా యెల్, అమెరికాతో యుద్ధంలో ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఐఆర్‌జీసీ (ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్)కు చెందిన అధికార ప్రతినిధి జనరల్ అలీ మొహమ్మద్ నైని మరణించాడు. ఈ విషయాన్ని ఇరాన్ అధికార మీడియా వెల్లడించింది.

ఇజ్రాయెల్ జరిపిన మిస్సైల్ దాడిలో అతడు ప్రాణాలు కోల్పోయినట్లు శుక్రవారం తెలిపింది. టెర్రరిస్టులు అయిన అమెరికా, జియోనిస్టులు జరిపిన దాడి లో తమ జనరల్ నైని వీరమరణం పొందారని ఐఆర్ జీసీ ప్రకటించింది. ఇప్పటికే ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనితోపాటు సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజాని, చీఫ్ ఆఫ్ స్టాఫ్ అబ్ధోల్ రహీమ్ మౌసావి, రక్షణ శాఖ మంత్రి అజీజ్ నసీర్జాదే వంటి ఇతర కీలక నేతలు కూడా ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన సంగతి తెలిసిందే. మరోవైపు తాము మాత్రం యుద్ధాన్ని ఆపేది లేదని ఇరాన్ ప్రకటించింది. శత్రువు అలసిపోయే వరకు తమ యుద్ధం కొనసాగుతుందని ఐఆర్‌జీసీ తెలిపింది. అమెరికాకు చేతనైతే యుద్ధనౌకల్ని పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో మోహరించాలని గతంలో నైని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు సవాల్ విసిరాడు.తమ దగ్గర మిస్సైళ్లకు కొరత లేదని, యుద్ధం కొనసాగు తున్న సమయంలో కూడా తాము మిస్సైల్స్ తయారు చేశామని ఇటీవలే నైని అన్నాడు. అంతకుముం దు అమెరికాకు చెందిన ఎఫ్-35 అనే యుద్ధ విమానాన్ని ఇరాన్ కూల్చి వేసిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోను కూడా ఇరాన్ విడు దల చేసింది. ఇజ్రా యెల్‌పై ఇరాన్ దాడులు కొనసాగిస్తూ ఉంది.

## తమిళనాడులో ఘోర ప్రమాదం..

## టెంపో, టూవీలర్‌ను ఢీకొన్న బస్సు.. 8 మంది మృతి

తమిళనాడు, మార్చి 20: తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అదుపుతప్పి వేగంగా వచ్చిన ప్రభుత్వ బస్సు.. ఒక టెంపోను, బైకును ఢీకొంది. ఈ ఘటనలో 8 మంది మరణించారు. ఈ ప్రమాదం తమిళనాడులోని అరియ నూర్ సమీపంలో, ఉత్తమ సోలాపురం వద్ద, సేలం జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. తమిళ నాడు స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టీఎన్ఎస్‌టీసీ)కి చెందిన బస్సు 40 మంది ప్రయాణికులతో కోయంబత్తూర్ నుంచి సేలం బయల్దేరింది. బస్సు వేగంగా వెళ్తుండగా, అదుపుతప్పి తన లేన్ దాటి పక్కకు వచ్చింది.

వెంటనే రోడ్డుపై డివైడర్ దాటి మరోవైపు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో అదే రోడుపై అటు నుంచి వస్తున్న టెంపో వాహనాన్ని (గూడ్స్ ఆటో) ఢీకొంది. ఆ తర్వాత అటు నుంచే వస్తున్న బైకును ఢీకొంది. ఈ ఘటనలో టెంపోలోని వారితోపాటు, బైకుపై వెళ్తున్న వారిపై నుంచి బస్సు దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మరణించారు. టెంపోలో మొత్తం 10 మంది ఉన్నారు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు, సమీప బంధువులు. ఒక వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా బస్సు ఢీకొంది. ఘటనలో ఎనిమిది మంది మరణించగా, మరికొందరికి గాయాల య్యాయి. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నారు.

## వంట, క్లీనింగ్ పనుల్లో భర్తలు కూడా పాలుపంచుకోవాల్సిందే: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మార్చి 20:భార్యాభర్తల సంబంధాల్లో సమానత్వం అత్యంత ముఖ్యమని సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. భార్యను పనిమనిషిలా చూడకూడదని, ఇంటి పనుల్లో భర్తలు కూడా బాధ్యత పంచుకోవాలని స్పష్టం చేసింది. వైవాహిక వివాదానికి సంబంధించిన ఒక కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. పెళ్లి చేసుకున్నది జీవిత భాగస్వామి కోసం కానీ సేవలు చేయించుకోవడానికి కాదని కోర్టు గట్టిగా చెప్పింది.

ఇంటి పనులు కేవలం మహిళల బాధ్యత అనే పాత భావజాలాన్ని భర్తలు మార్చుకోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా పురుషులు తమ ఆలోచనలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని ధర్మాసనం సూచించింది. వంట, శుభ్రపరిచే పనులు వంటి గృహ కార్యకలాపాల్లో భర్తలు కూడా సమానంగా చేయాల్సిందేనని పేర్కొంది. ఇంటి పనుల్లో సమాన భాగస్వామ్యం ఉన్నప్పుడే భార్యాభర్తల మధ్య బంధం బలపడుతుందని కోర్టు అభిప్రాయపడింది.

## కల్తీ చేస్తే కఠిన చర్యలు.. డీసీపీ గైక్వాడ్ వైభవ్ హెచ్చరిక



హైదరాబాద్, మార్చి 20:నగరంలో ఆహార కల్తీపై కట్టుదిట్టమైన చర్యలకు పోలీసులు శ్రీకారం చుట్టారు. హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్ (ఊ-ఈయూ)ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్.. ంఃఔతో మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు.

ఈ ప్రత్యేక బృందంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ సిబ్బంది కలిసి సుమారు 32 మంది సభ్యులు ఉంటారని గైక్వాడ్ వైభవ్ తెలిపారు. వీరు జీహెచ్‌ఎంసీ ఫుడ్ ఇన్స్పెక్టర్లతో కలిసి నగరవ్యాప్తంగా జాయింట్ రైడ్స్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆహార పదార్థాల్లో కల్తీ ఎక్కువగా జరుగుతోందని.. ముఖ్యంగా పాలు, నాన్-వెజ్ కల్తీ చేస్తున్నారని ఆయన వెల్లడించారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్న ఈ సమస్యను అరికట్టేందుకు కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, పదే పదే ఇలాంటి కార్యకలాపాల్లో పట్టుబడితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా, కల్తీ ఆహారం విక్రయించే దుకాణాలను సీజ్ చేసే చర్యలూ చేపడతామని తెలిపారు. కల్తీ ఆహార పదార్థాల గురించి సమాచారం ఉంటే వెంటనే 8712661212 నంబర్‌కు వివరాలు అందించవచ్చని నగర ప్రజలకు సూచించారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ డాక్యుమెంటరీ చిత్రానికి గద్దర్ అవార్డు




చౌటుప్పల్, మార్చి 20: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫిలింఫేర్ అవార్డు ద్వితీయ సంవత్సర గద్దర్ పేరు మీద ఇచ్చే అవార్డు మొట్ట మొదటిసారిగా తెలంగాణ ఉద్యమకారుడు, పద్మశాలి ముద్దుబిడ్డ స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ డాక్యుమెంటరీ చిత్రానికి దక్కింది.

ఈ చిత్రాన్ని నిర్మించిన చిరందాసు ధనంజయ తో పాటు చిత్రం యూనిట్ ప్రతిభను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గోల్డెన్ మెమొంటో, ప్రశంసాపత్రం, ఐదు లక్ష రూపాయలు నగదును రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఫిలిం ఫెడరేషన్ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు చేతుల మీదుగా అందజేశారు. చిత్ర యూనిట్ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందజేసినందుకు చిత్ర యూనిట్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.


49 కిన్నెర




ఆహ్వానం
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయగాన సభ
ఉదయ సాహితి, తెలంగాణ
సంయుక్త ఆధ్వర్యంలో

ప్రముఖ కవి, రచయిత, పూర్వ ఉపకులపతి
శాతవాహన విశ్వ విద్యాలయం
ఆచార్య కడారు వీరారెడ్డి గారి
లోకాలోకనం వ్యాస సంపుటి
ఆవిష్కరణ సభ

తేదీ: 22-03-2026 ఆదివారం ఉదయం 10.00 గంటలకు
లలిత కళా వేదిక, త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాద్

ముఖ్యఅతిథి-ఆవిష్కర్త : డా॥ సుద్దాల అశోక్ తేజ
ప్రసిద్ధ కవి, జాతీయ ఉత్తమ సినీ గేయకవి పురస్కార గ్రహీత

సభాధ్యక్షులు : శ్రీ దాస్యం సేనాధిపతి, ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు
రాష్ట్ర గౌరవాధ్యక్షులు, ఉదయసాహితి, తెలంగాణ

విశిష్ట అతిథులు : శ్రీ కళా జనార్దనమూర్తి, అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
శ్రీ బైస దేవదాసు సంపాదకులు, నేటి నిజం

గౌరవఅతిథి : ఆచార్య మసన చెన్నప్ప, ప్రసిద్ధ సాహితీ వేత్త
పూర్వ అధ్యక్షులు, తెలుగు శాఖ ఉస్మానియా విశ్వవిద్యాలయం

ఆత్మీయ అతిథి : శ్రీ మౌనశ్రీ మల్లిక్, ప్రముఖ కవి, టి.వి., సినీ గేయ కవి

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు, కిన్నెర
మద్దాళి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర
శ్రీమతి కళా శారద కార్యదర్శి, శ్రీ త్యాగరాయగానసభ

# అన్ని రకాల వివక్షలను అంతం చేద్దాం !

## (21 మార్చి "అంతర్జాతీయ జాతి వివక్ష నిర్మూలన దినం" సందర్భంగా)

నాడు దక్షిణ ఆఫ్రికాలో శరీర చర్మ రంగు కారణంగా మహాత్మాగాంధీని తాను ప్రయాణిస్తున్న రైలు నుంచి బయటకు గెంటివేయడం జరిగిన విషయం మనకు తెలుసు. 2020లో తెల్లతోలు పోలీసులతో ఘర్షణలో 46 ఏండ్ల నల్ల తోలు జార్జి ఫ్రాయిడ్ దుర్మరణం పాలుకావడం కూడా విన్నాం. ఇలా నాటి నుంచి నేటి వరకు వర్ణ, జాతి వివక్ష దురాచార దురహంకారం ప్రపంచాన్ని చుట్టేస్తూనే ఉన్నది. 21 మార్చి 1960న దక్షిణ ఆఫ్రికాలో వర్ణ వివక్ష చట్టాలకు వ్యతిరేకంగా నిర్వహించిన శాంతియుత నిరసన కార్యక్రమంలో జరిపిన అమానవీయ పోలీసు కాల్పుల్లో 69 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం జరిగింది. ఈ ఘటనకు గుర్తుగా ఐరాస తీర్మానం ప్రకారం ప్రతి ఏట 21 మార్చిన "అంతర్జాతీయ జాతి వివక్ష నిర్మూలన దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఎలిమినేషన్ ఆఫ్ రేషియల్ డిస్క్రిమినేషన్)"ను పాటించుట ఆనవాయితీగా మారింది.

### సమానత్వ సాధనకు ఉద్యమిద్దాం :

2026 అంతర్జాతీయ జాతి వివక్ష నిర్మూలన దినం ఇతివృత్తంగా "అన్ని రకాల జాతి వివక్షల నిర్మూలనపై 60వ అంతర్జాతీయ దినోత్సవం- రాజకీయ సంకల్పం కూడగట్టడం" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న వివిధ రకాల వివక్షలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున మానవ హక్కుల ఉల్లంఘనల పట్ల అవగాహన కార్యక్రమాలను నిర్వహించుట కొనసాగుతున్నది. మానవాళిపై సమానత్వం, సాంస్కృతిక సహనశీలత, జాతి పక్షపాత రహిత ధోరిణి, వివక్ష కానరాని సమాజ స్థాపనల పట్ల మానవాళిపై చైతన్యం కలిగించడమే ఏకైక ఉద్దేశంతో ఈ దినం నిర్వహిస్తున్నారు. జాత్యహంతకారం, జాతి వివక్ష, వర్ణ వివక్ష, విదేశీ జాతుల పట్ల వివక్ష, కులమత విభేదాలు, అంటరానితనం, వివక్షతతో అహంకార పోకడలు నేటి డిజిటల్ ప్రపంచంలో కూడా కనిపించడంతో సోచనీయం. ఏ దేశంలో ఉన్నప్పటికీ మనిషిని మనిషిగా చూడగలిగే రోజులు రావడానికి అనేక ఉద్యమాలు జరిగాయి, జరుగుతూనే ఉన్నాయి. "ఫైట్ రేసిజమ్ లేదా జాత్యహంకారపై పోరు" అనే నినాదం నిత్యం జపించాల్సిన అగత్యం ఏర్పడింది. విశ్వ మానవాళి ఐక్యత మంత్రాన్ని జపిస్తూ, భిన్నత్వంలో ఏకత్వం సాధిస్తూ, మానవ హక్కుల గీతాలు దాటకుండా నిలబడుతూ, సమానత్వ సాధన దిశగా గట్టి అడుగులు పడే విధంగా మన ప్రవర్తనలు మారాలి. శరనార్థులు, వలసదారుల వేదనలకు సరైన సమాధానాలు వెతికే మహాకార్యం చేపట్టడానికి నడుం బిగించాలి.

వ్యక్తిగత గౌరవాన్ని నిలుపుకోవడం, జాతి వివక్షకు తావివ్వకపోవడం, వర్ష వర్గీకరణను వ్యతిరేకించడం, మానవ హక్కుల చట్టాల ఉల్లంఘనలను తీవ్రంగా తీసుకోవడం, అందరిని సమదృష్టితో చూసుకోవడం, అందరి సంస్కృతులను గౌరవించడం లాంటి చర్యలు వివక్ష రహిత సమాజ స్థాపనకు ఉపకరిస్తాయి. వర్ణ వర్గ వివక్షకు బదులుగా విద్య, వ్యక్తిత్వం, ఉన్నత ఆలోచనలు, నైతిక ప్రవర్తనలు, విషయ పరిజ్ఞానం, శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను బట్టి వ్యక్తులను గౌరవించే రోజులు రావాలని కోరుకుందాం. తెల్ల తోలు, నల్ల తోలు ఆలోచనలను బొంద పెడదాం. వివక్షను పోషించే చేతులకు, చేతలకు బేడీలు వేద్దాం. మానవత్వమే మంత్రంగా వివక్ష రహిత సమాజ స్థాపనకు ఉద్యమిద్దాం.



-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# 2026-27 నుంచి 2030-31 కాలానికి 'చిన్న నీటి విద్యుత్ ప్రాజెక్టుల (ఎస్‌హెచ్‌పీ) అభివృద్ధి పథకానికి' కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 20:2026-27 నుంచి 2030-31 కాలానికి 'చిన్న నీటి విద్యుత్ (ఎస్‌హెచ్‌పీ) అభివృద్ధి పథకానికి' ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. సుమారు 1500 మెగావాట్ల సామర్థ్యం గల చిన్న నీటి విద్యుత్ ప్రాజెక్టుల కోసం రూ. 2584.60 కోట్ల వ్యయంతో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు.

వివిధ రాష్ట్రాల్లో 1 మెగావాట్ నుంచి 25 మెగావాట్ల (ఎండబ్ల్యూ) సామర్థ్యం గల చిన్న నీటి విద్యుత్ ప్రాజెక్టులకు ఈ పథకం మద్దతునిస్తుంది. ముఖ్యంగా అపారమైన సామర్థ్యం ఉన్న పర్వత ప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాలకు ఇది ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తుంది. ఈశాన్య రాష్ట్రాల్లో, అంతర్జాతీయ సరిహద్దులు కలిగిన జిల్లాలలో ఒక్కో మెగావాట్‌కు రూ. 3.6 కోట్లు లేదా ప్రాజెక్ట్ వ్యయంలో 30 శాతం (ఏది తక్కువైతే అది).. గరిష్టంగా ఒక ప్రాజెక్ట్‌కు రూ. 30 కోట్ల వరకు కేంద్ర ఆర్థిక సహాయం అందుతుంది. ఇతర రాష్ట్రాల్లో మెగావాట్‌కు రూ. 2.4 కోట్లు లేదా ప్రాజెక్ట్ వ్యయంలో 20 శాతం (ఏది తక్కువైతే అది).. గరిష్టంగా రూ. 20 కోట్ల పరిమితితో ఆర్థిక సహాయం లభిస్తుంది. దూర ప్రాంతాలు, చేరుకోవడానికి కష్టతరమైన ప్రాంతాల్లో ఉన్న చిన్న నీటి విద్యుత్ సామర్థ్యాన్ని వినియోగించుకోవడానికి ఇది తోడ్పడుతుంది. ఇటువంటి ప్రాజెక్టుల కోసం రూ. 2,532 కోట్లు కేటాయించారు. దీనివల్ల ఈ రంగంలో రూ. 15,000 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. ఇది స్వచ్ఛ ఇంధన లక్ష్యాలు, గ్రామీణ ప్రాంతాల్లో పెట్టుబడులు, ఉపాధి అవకాశాల కల్పనకు ఊతమిస్తుంది. ఈ ప్రాజెక్టులకు అవసరమైన ప్లాంట్, యంత్రాలను 100 శాతం స్వదేశీ వనరుల నుంచే సమకూర్చుకోవడం ద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాన్ని ఇది నెరవేరుస్తుంది.

భవిష్యత్తులో చిన్న నీటి విద్యుత్ ప్రాజెక్టుల జాబితాను సిద్ధం చేయడం కోసం సుమారు 200 ప్రాజెక్టులకు సంబంధించిన 'సవివర ప్రాజెక్ట్ నివేదికలను' (డీపీఆర్) రూపొందించేలా రాష్ట్రాలను ఈ పథకం ప్రోత్సహిస్తుంది. ఇటువంటి డీపీఆర్‌ల తయారీలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు మద్దతుగా రూ. 30 కోట్ల నిధులను కేటాయించారు.

ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో సుమారు 51 లక్షల పని దినాల ఉపాధిని ఈ పథకం కల్పిస్తుంది. ప్రధానంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఏర్పాటయ్యే ఈ చిన్న నీటి విద్యుత్ ప్రాజెక్టుల (ఎస్‌హెచ్‌పీ) నిర్వహణ, కార్యకలాపాలలో కూడా నిరంతర ఉపాధికి ఇది దోహదపడుతుంది. ఈ ప్రాజెక్టులు వికేంద్రీకృత స్వభావాన్ని కలిగి ఉండటం వల్ల సుదీర్ఘమైన విద్యుత్ సరఫరా లైన్ల అవసరం చాలా తక్కువగా ఉంటుంది. దీనివల్ల విద్యుత్ సరఫరా నష్టాలు కూడా తగ్గుతాయి.

ఈ పథకం ప్రారంభమవటం వల్ల చిన్న నీటి విద్యుత్ (ఎస్‌హెచ్‌పీ) రంగం పునరుజ్జీవనం పొందుతుంది. అంతేకాకుండా అందుబాటులో ఉన్న సామర్థ్యాన్ని మరింత వేగంగా వినియోగించుకోవడానికి ఇది తోడ్పడుతుంది. పెద్ద ఎత్తున భూసేకరణ, అడవుల నరికివేత, ప్రజల తరలింపు వంటి సమస్యలు ఉండవు కాబట్టి చిన్న నీటి విద్యుత్ ప్రాజెక్టులు పర్యావరణ పరంగా సుస్థిరమైనవి. స్థానిక పెట్టుబడులను ప్రోత్సహించడం ద్వారా ఇవి మారుమూల ప్రాంతాల సామాజిక-ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయి. సాధారణంగా ఈ ప్రాజెక్టుల కాలపరిమితి 40 నుంచి 60 సంవత్సరాలకు పైగా ఉండటం వల్ల ఇవి దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తాయి.

# 'ఈద్' శుభాకాంక్షలు తెలిపిన ప్రధానమంత్రి... పశ్చిమాసియా పరిస్థితులపై ఉభయుల చర్చ

న్యూఢిల్లీ, మార్చి 20:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ కువైట్ యువరాజు మాననీయ షేక్ సబా అల్-ఖాలెద్ అల్-హమద్ అల్-ముబారక్ అల్-సబాతో సంభాషించారు. ఈ సందర్భంగా ఆయనకు ఈద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన అనంతరం ప్రాంతీయ భద్రత పరిణామాలపై వారిద్దరూ సమీక్షించారు.

ఈ మేరకు పశ్చిమ ఆసియాలో ఇటీవలి పరిణామాలు, రోజురోజుకూ మారుతున్న పరిస్థితులపై శ్రీ మోదీ, యువరాజు ఇద్దరూ ఆందోళన వ్యక్తం చేస్తూ, పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నారు. కువైట్ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతపై దాడులను భారత్ ఖండిస్తున్నదని ప్రధానమంత్రి పునరుద్ఘాటించారు. హోర్ముజ్ జలసంధి గుండా సురక్షిత, స్వేచ్ఛాయుతమైన నౌకాయానానికి భరోసాయే అత్యంత ప్రాధాన్యాంశమని ఆయన స్పష్టం చేశారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వం దిశగా నిరంతర దౌత్య సంబంధాలు అవసరమని నాయకులిద్దరూ అభిప్రాయపడ్డారు. కువైట్‌లోని భారతీయుల భద్రత, శ్రేయస్సును నిరంతరం పర్యవేక్షిస్తున్నందుకుగాను యువరాజుకు ప్రధానమంత్రి ధన్యవాదాలు తెలిపారు.

ఈ సమావేశం వివరాలను సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా పంచుకుంటూ:

"ఈ రోజు కువైట్ యువరాజు గౌరవనీయ షేక్ సబా అల్-ఖాలెద్ అల్-హమద్ అల్-ముబారక్ అల్-సబాతో సంభాషించాను. ఈ సందర్భంగా ఈద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశాను.

అలాగే, పశ్చిమ ఆసియాలో పరిస్థితులపై మా అభిప్రాయాలను పంచుకుంటూ ఇటీవలి పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేశాం. కువైట్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతపై దాడులను భారత్ ఖండిస్తున్నదని నేను పునరుద్ఘాటించాను. హోర్ముజ్ జలసంధి గుండా సురక్షిత, స్వేచ్ఛాయుత నౌకాయానానికి భరోసాయే మా అగ్ర ప్రాథమ్యం.

ప్రాంతీయ శాంతి, స్థిరత్వం దిశగా నిరంతర దౌత్య సంబంధాల ఆవశ్యకతపై మేం అంగీకారానికి వచ్చాం.

కువైట్‌లోని భారతీయుల భద్రత, శ్రేయస్సు దిశగా నిరంతర మద్దతుకుగాను ఆయనకు నేను ధన్యవాదాలు తెలిపాను" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# రాజకీయాల్లో ముగింపు ఉండదు.. మీ అనుభవం, కృషి దేశ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతాయి: పీఎం

న్యూఢిల్లీ, మార్చి 20: రాజ్యసభ నుంచి పదవీ విరమణ పొందుతున్న వారిని ఉద్దేశించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ ప్రసంగించారు. పదవీ విరమణ పొందే సహచరులను గౌరవించే అవకాశం లభించినందుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటువంటి సందర్భాలు సభను పార్టీలకతీతంగా ఒక్కటి చేస్తాయని, అందరిలో ఒకే భావనను నింపుతాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. సభ్యులు తిరిగి సభకు వచ్చినా, సామాజిక సేవ వైపు మళ్లినా.. వారి అనుభవం దేశానికి గొప్ప ఆస్తిగా నిలుస్తుందన్నారు. ఎన్నో మార్పులతో కూడిన రాజకీయ రంగంలో ప్రయాణం ఎప్పటికీ ముగియదని.. అనుభవజ్ఞులైన నాయకులకు నూతన అవకాశాలను అందిస్తుందని ఆయన అన్నారు. "రాజకీయాల్లో ఎప్పుడూ ముగింపు ఉండదు. మీ అనుభవం, కృషి దేశ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతాయి" అని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

సభకు వీడ్కోలు పలుకుతున్న సభ్యుల సహకారాన్ని కొనియాడుతూ.. శ్రీ దేవెగౌడ, శ్రీ మల్లికార్జున ఖర్గే, శ్రీ శరద్ పవార్ వంటి అనుభవజ్ఞులను రోల్ మోడల్స్‌గా తీసుకోవాలని కొత్త తరం ఎంపీలకు ప్రధానమంత్రి సూచించారు. డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ జీ మృదు స్వభావాన్ని, క్లిష్ట పరిస్థితుల్లోనూ సభ విశ్వాసాన్ని కాపాడుతూ ఆయన వ్యవహరించిన తీరుని ప్రశంసించారు. అంకితభావంతో కూడిన సేవ, సమాజం అప్పగించిన బాధ్యతల పట్ల నిబద్ధతకు ఇది నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. "సమాజం ఇచ్చిన బాధ్యతలకు కట్టుబడి ఉండటాన్ని ఈ సీనియర్ నాయకుల నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

మారుతున్న సభ సంప్రదాయాలను గుర్తు చేసుకుంటూ.. నేటి 24జ7 మీడియా వాతావరణం అందరినీ అప్రమత్తం చేసినప్పటికీ పార్లమెంటు చరిత్రలో హాస్యం, చమత్కారం ఇప్పటికీ అంతర?భాగంగా ఉన్నాయని పీఎం శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. ప్రతి రెండేళ్లకోసారి ఒక బృందం పదవీ విరమణ పొందటం వల్ల నిరంతరం జ్ఞానమార్పిడి జరుగుతుందని, నూతనంగా వచ్చే సభ్యుల ద్వారా వారసత్వ పరిరక్షణ జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సంస్థాగత కొనసాగింపు, ప్రజాస్వామ్య ప్రక్రియను బలోపేతం చేసేందుకు కీలకమని శ్రీ నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. "ఈ వారసత్వం పార్లమెంటరీ వ్యవస్థను సుసంపన్నం చేసే నిరంతర ప్రక్రియ" అని ప్రధానమంత్రి కొనియాడారు.

రాజ్యసభకున్న విశిష్ట ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ.. మన పార్లమెంటరీ వ్యవస్థకు "రెండో అభిప్రాయం" అపారమైన బలాన్ని చేకూరుస్తుందని పీఎం శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. నిర్ణయాలు ఒక సభ నుంచి మరొక సభకు వెళ్లే ప్రక్రియ, శాసన నిర్మాణంలో కీలకమైన కోణాన్ని జోడించడమే కాక, దేశానికి మెరుగైన ఫలితాలని అందిస్తుందన్నారు. ఈ ప్రజాస్వామ్య వారసత్వం జాతీయ నిర్ణయాధికారంలో పారదర్శకతను, విశ్లేషణను పెంపొందిస్తుందని తెలిపారు. "పార్లమెంటరీ వ్యవస్థకు రెండో అభిప్రాయం అందించే విలువైన సహకారాన్ని సుముచితంగా గౌరవించుకోవాలి" అని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు.

పదవీ విరమణ పొందుతున్న సభ్యుల పదవీ కాలంలో పాత, కొత్త పార్లమెంటు భవనాల్లో సేవలందించిన అరుదైన గౌరవాన్ని పొందారని ప్రధానమంత్రి అన్నారు. నూతన పార్లమెంటు భవనంలో జరిగిన ఈ చారిత్రాత్మక మార్పులో భాగస్వాములవటం.. వారి ప్రజా జీవితంలో ఒక సరికొత్త, కీలక జ్ఞాపకంగా నిలిచిపోతుందని అన్నారు. సభను "గొప్ప బహిరంగ విశ్వవిద్యాలయం"గా శ్రీ నరేంద్ర మోదీ అభివర్ణించారు. ఈ సభ దేశంలోని సంక్లిష్ట అంశాలపై అవగాహన కల్పించే విశిష్టమైన విద్యను సభ్యులకు అందిస్తుందని తెలిపారు. "దేశ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించటానికి, వ్యక్తిగత ఎదుగుదలకు ఇక్కడ గడిపిన ఆరేళ్లు ఎంతో కీలకం" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

సభ్యుల పార్లమెంటరీ అనుభవం ద్వారా దూరదృష్టి, సామర్థ్యం పెరిగాయని శ్రీ నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. పదవీ విరమణ పొందుతున్న సభ్యులు అధికార వ్యవస్థలో ఉన్నా, స్వతంత్రంగా సామాజిక సేవ చేస్తున్నా దేశ నిర్మాణానికి వారు అందించిన అమూల్యమైన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. పదవీ విరమణ పొందుతున్న ప్రజాప్రతినిధుల సుదీర్ఘ, అంకితభావంతో కూడిన సేవలను పీఎం శ్రీ నరేంద్ర మోదీ మరోసారి కొనియాడుతూ, వారి నిబద్ధతకు కృతజ్ఞతలు తెలిపారు. "పదవీ విరమణ పొందుతున్న సభ్యులందరి సహకారానికి మరోసారి అభినందనలు, వారి సేవలకు ప్రశంసలు తెలియజేస్తున్నా" అంటూ శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగాన్ని ముగించారు.

# పర్యావరణ పరిరక్షణ మన ధ్యేయం..

## ఈ నెల 22 వ తేదిన బాలమేళా వార్షికోత్సవం..



అమరావతి, మార్చి 20: చిన్నారుల ఉన్న తొలగించి బాలలను మంచి పౌరులుగా తీర్చిదిద్ది భరతమాత సేవలు పాలుపంచుకునే విధంగా వారిని తీర్చిదిద్దడం సంఘమిత్ర ప్రధాన లక్ష్యమని అధ్యక్షులు చిలుకూరి శ్రీనివాస్ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు మహేశ్వర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి కర్నాటి నాగ సుబ్బారెడ్డి లు పేర్కొన్నారు. శుక్రవారం సంఘమిత్ర సేవా సమితి ఆధ్వర్యంలో బాలమేళా వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

మాట్లాడుతూ ఉపేక్షిత బస్తీలలో నివసించే పిల్లలను, మంచి పౌరులుగా తీర్చిదిద్ది, భరతమాత సేవలో పాల్గొని విధంగా చేయాలన్న సంకల్పంతో ఈ సమస్య ఏర్పడిందన్నారు. అందులో భాగగా ఈనెల 22వ తేదీ వైయస్సార్ కళ్యాణ మండపం ప్రథమనందిలో మా అభ్యాసికల బాలమేళా వార్షికోత్సవం జరుగునన్నారు. ఈ కార్యక్రమానికి మాకు సహాయ సహకారాలతో, అండదండలతో, ఆదరాభిమానాలతో అభిమానిస్తున్న దాతలకు, శ్రేయోభిలాషులకు ఇవే మా సంఘమిత్ర కార్యవర్గ సహృదయంగా ఆహ్వానిస్తున్నమన్నారు.

సంఘమిత్ర సేవా సమితి నిరాశ్రిత బాలల ఆవాసము ఉచిత విద్యా గృహం చెంచుల కోసం ఐఎంఏ డాక్టర్స్ మహిళా విభాగం సహాయ సహకారాలతో సంచార వైద్యశాల, పర్యావరణ సమాజ శ్రేయస్సు కోసం ప్లాస్టిక్ వాడడం నిరోధించడంలో భాగంగా, "పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత" భాగంలో స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉపేక్షిత బస్తీలలో అభ్యాసి గల పేరుతో విద్యా, వైద్యం, ఆరోగ్య అవగాహన, సంస్కృతి, సాంప్రదాయాల మీద ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నమన్నారు.

కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలోసహ కార్యదర్శి కరణం సుందర రావు సంఘటన కార్యదర్శి సిరిగిరి జయశ్రీ సభ్యులు డివి అశోక్ కుమార్, వెంకటేశ్వరమ్మ, వెంకటరమణయ్య, రామాంజనేయులు ప్రచార ప్రముఖ చింతలపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడండి

## -నంద్యాల గ్రేడ్ వన్ మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ బాధ్యతల స్వీకరణ..



అమరావతి, మార్చి 20: రాష్ట్ర ప్రభుత్వము రాష్ట్రంలోని 75 మున్సిపాలిటీలను 11 కార్పొరేషన్ల పాలకమండలి దరువు పూర్తి అవ్వటంతో నూతనంగా మున్సిపాలిటీలకు కార్పొరేషన్లకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఈ ఉత్తర్వుల మేరకు నంద్యాల గ్రేడ్ 1 మున్సిపాలిటీకి ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా శుక్రవారంబాధ్యతలు స్వీకరించారు.

మున్సిపల్ కమిషనర్ శేషన్నతో పాటు సంబంధిత శాఖల అధికారులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులకు సూచనలు సలహాలు ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై, పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

ఏమాత్రం ఫిర్యాదులు అందిన సహించేది లేదని హెచ్చరించారు. నగర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంతో పాటు ప్రజల సమస్యలను సమయానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. అధికారులు కూడా పట్టణ అభివృద్ధికి సహకరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ఇంజనీర్ గుర్రప్ప యాదవ్, పట్టణ ప్రణాళిక అధికారులు తదితరు లు పాల్గొన్నారు.

## క్రికెట్ బెట్టింగ్ పాల్పడిన వారికి పోలీసుల కౌన్సిలింగ్

అమరావతి, మార్చి 20: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడిన పలువురిని అదుపులోకి తీసుకొని వారికి పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. గురువారం రాత్రి దర్శి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దర్శి డీఎస్పీ బి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. క్రికెట్ బెట్టింగ్ కేసులో ఇటీవల అరెస్టై రిమాండ్‌లో ఉన్న నలుగురు నిందితులను కోర్టు అనుమతితో మూడు రోజుల పాటు తమ కస్టడీకి తీసుకున్నట్లు తెలిపారు.

పోలీసులు తీసుకుంటున్న కఠిన చర్యలతో బెట్టింగ్ రాకెట్లలో ఉన్నవారిలో భయం నెలకొన్నదన్నారు. వీరితో పాటు డబ్బు ఆశతో బెట్టింగ్‌లో పాల్గొన్న సుమారు 11 మందిని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించి, బైండోవర్ చేసినట్లు వెల్లడించారు.

# పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి పరిహారం ప్రకటించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, మార్చి 20:ఇండోర్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రధానమంత్రి తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు పరిహారం ప్రకటించారు.

ఇండోర్ అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల ప్రధానమంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ.. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆయన ప్రార్థించారు. మృతుల కుటుంబాలకు పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి రూ. 2 లక్షల పరిహారం, గాయపడిన వారికి రూ. 50,000 అందిసున్నామని శ్రీ మోదీ ప్రకటించారు.

సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రధానమంత్రి ఇలా పేర్కొన్నారు.

"మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం జరగడంపై తీవ్ర ఆవేదన చెందుతున్నాను. తమ ఆప్తుల్ని కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని నేను ప్రార్థిస్తున్నాను.

మృతుల కుటుంబాలకు పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి రూ. 2 లక్షల చొప్పున .. అలాగే గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం అందిస్తున్నాను అని ప్రధానమంత్రి తెలిపారు.




# తక్షణ వినియోగానికి సిద్ధంగా ఉన్న పారిశ్రామిక వసతులను అభివృద్ధి చేసే

# భారత్ ఔద్యోగిక వికాస్ యోజన (భవ్య)కు మంత్రివర్గం ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 20:పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేసే దిశగా చరిత్రాత్మకమైన అడుగు వేస్తూ.. భారత్ ఔద్యోగిక వికాస్ యోజన (భవ్య)కు ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ అధ్యక్షతన ఈ రోజు నిర్వహించిన మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకానికి రూ.33,660 కోట్ల నిధులను కేటాయించారు. దేశవ్యాప్తంగా తక్షణ వినియోగానికి సిద్ధంగా ఉన్న ప్లగ్-అండ్-ప్లే పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడానికి ఈ నిధులను వినియోగిస్తారు.

అంతర్జాతీయ స్థాయి పారిశ్రామిక మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, భారతదేశ అభివృద్ధి గాథను ముందుకు నడిపించేలా దేశ తయారీ సామర్థ్యాలను వెలికి తీయడమే ఈ పథకం లక్ష్యం.

**వికసిత్ భారత్ కోసం పారిశ్రామిక పునాది ఏర్పాటు:**

జాతీయ పారిశ్రామిక వాడల అభివృద్ధి కార్యక్రమం (ఎన్ఐసీడీపీ) ద్వారా నిర్మించిన పారిశ్రామిక స్మార్ట్ సిటీలు సాధించిన విజయం ఆధారంగా భవ్యను రూపొందించారు. దీనిని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో అమలు చేస్తారు.

ఆమోదాల నుంచి కార్యకలాపాల ప్రారంభం వరకు: వ్యాపారంలో నూతన సౌలభ్యంక్రమబద్ధీకరించిన ఆమోదాలు, సమర్థవంతమైన ఏకగవాక్ష వ్యవస్థలు, రాష్ట్రాల నేతృత్వంలో పెట్టుబడిదారులకు అనుకూలమైన సంస్కరణలతో నియంత్రణల సడలింపు, వ్యాపార సౌలభ్యాన్ని ప్రోత్సహించడమే భవ్య పథకం ప్రధానోద్దేశం.

వినియోగానికి సిద్ధంగా ఉన్న ప్లగ్-అండ్-ప్లే పారిశ్రామిక వ్యవస్థలను ఈ పథకం అందిస్తుంది. దీనివల్ల పరిశ్రమలు తమ ఆలోచనను వేగంగా, నిశ్చయంగా ఉత్పత్తి రూపంలోకి తీసుకువస్తాయి. ముందస్తు అనుమతులు పొందిన భూమి, సిద్ధంగా ఉన్న మౌలిక వసతులు, ఏకీకృత సేవల ద్వారా పెట్టుబడిదారులకు ప్రారంభ దశలో ఎదురయ్యే అవరోధాలను భవ్య గణనీయంగా తగ్గిస్తుంది.

ఇప్పటికే ఉన్న వ్యవస్థలతో ఎలాంటి ఆటంకాలు లేకుండా అనుసంధానం, ఏకీకరణకు బాహ్య మౌలిక సదుపాయాల కోసం ప్రాజెక్టు వ్యయంలో 25 శాతం వరకు మద్దతు లభిస్తుంది.

అత్యంత నాణ్యమైన, సంస్కరణ ఆధారితమైన, పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న ప్రతిపాదనలను మాత్రమే ముందుకు తీసుకెళ్లేలా పోటీ విధానంలో ప్రాజెక్టులను ఎంపిక చేస్తారు.

ఎలాంటి అవరోధాలు లేని బహుళ విధ రవాణా అనుసంధానాన్ని, చివరి మైలు వరకు సమర్థవంతంగా చేరుకొనే వీలును కల్పించేందుకు పీఎం గతిశక్తి సూత్రాలకు అనుగుణంగా ఉంటుంది.

సమీకృత భూగర్భ సౌకర్యాలతో పాటు హరిత ఇంధనం, సుస్థిరమైన వనరుల ఏర్పాటు. దీనివల్ల భవిష్యత్తులో మళ్లీ తవ్వకాల అవసరం లేకుండా సమర్థవంతమైన నిర్వహణకు, ఆటంకాలు లేని పారిశ్రామిక కార్యకలాపాలకు వీలు కలుగుతుంది.

వివిధ రంగాల్లో విశ్వసనీయతకు హామీ ఇస్తూ, లోపాలను తగ్గిస్తూ, ఉత్పాదకతను విస్తరించేలా పారిశ్రామిక మౌలిక వసతులకు సంబంధించి నూతన ప్రమాణాలను ఈ పార్కులు ఏర్పాటు చేస్తాయి.

**ప్రాంతాల వారీగా ఉద్యోగాలు, పెట్టుబడులు, ఆర్థిక ప్రగతికి ప్రోత్సాహం**

తయారీ, సరకు రవాణా, సేవల రంగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగాలను, ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని భవ్య పథకం కల్పిస్తుందని, అదే సమయంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తుందని అంచనా వేస్తున్నారు.

ఈ పథకం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలవుతుంది. తద్వారా దేశవ్యాప్తంగా లక్షలాది ఉపాధి అవకాశాలు కల్పించి, పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేస్తుంది.

క్లస్టర్ ఆధారిత అభివృద్ధిని ప్రోత్సహిస్తూ.. పరిశ్రమలు, పంపిణీదారులు, సేవా సంస్థలు ఒకే చోట ఉండేలా చేసి దేశీయ సరఫరా వ్యవస్థలను భవ్య పథకం బలోపేతం చేస్తుంది. అలాగే ప్రాంతీయ పారిశ్రామికీకరణను ప్రోత్సహిస్తుంది. లక్షలాది మంది ప్రజలకు కొత్త అవకాశాలను కల్పిస్తుంది.

**ఈ పథకం లబ్ధిదారులు:**

ప్రాథమిక లబ్ధిదారులు: సిద్ధంగా ఉన్న పారిశ్రామిక వసతుల కోసం చూస్తున్న తయారీ యూనిట్లు, ఎంఎస్ఎంఈలు, అంకుర సంస్థలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు.

ద్వితీయ లబ్ధిదారులు: కార్మికులు, సరకు రవాణా సేవలందించేవారు, సేవారంగంలోని సంస్థలు, స్థానిక సమాజాలు.

ఆత్మనిర్భర్ భారత్ దిశగా దేశం సాగిస్తున్న ప్రయాణంలో భవ్య ఆమోదం ఒక పరివర్తనాత్మక ముందడుగును సూచిస్తుంది. ఇది దేశీయంగా ఉత్పాదక సామర్థ్యాలను బలోపేతం చేస్తుంది. ఎగుమతులను పెంచుతుంది. పటిష్ఠమైన, సమ్మిళితమైన, ప్రపంచవ్యాప్తంగా పోటీపడగల ఆర్థిక వ్యవస్థకు పునాది వేస్తుంది.

**ఎన్ఐసీడీసీ గురించి:**

వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వశాఖ పరిధిలోని పారిశ్రామిక, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) ఆధ్వర్యంలో జాతీయ పారిశ్రామిక వాడల అభివృద్ధి సంస్థ (ఎన్ఐసీడీసీ) పనిచేస్తుంది. ఇది తయారీ రంగంలో పోటీతత్వాన్ని పెంచడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి, ఉపాధిని కల్పించడానికి అంతర్జాతీయ స్థాయిలో నూతన పారిశ్రామిక స్మార్ట్ సిటీలను అభివృద్ధి చేస్తోంది. ప్రస్తుతం 13 రాష్ట్రాల్లో 20 ప్రాజెక్టులను ఎన్ఐసీడీసీ అమలు చేస్తోంది.

వినియోగానికి సిద్ధంగా ఉన్న ప్లగ్-అండ్-ప్లే పారిశ్రామిక పార్కులు అనే ఆలోచన ఆధారంగా ఎన్ఐసీడీసీ చేపట్టే కార్యక్రమాలు తయారయ్యాయి. ఇవి తక్షణమే ఉపయోగించుకోవడానికి సిద్ధంగా ఉన్న వ్యవస్థలను అభివృద్ధి చేస్తాయి. వీటిలో భూమి, సౌకర్యాలు, అనుమతులు, మౌలిక వసతులను ముందుగానే అభివృద్ధి చేస్తారు. ఫలితంగా భూసేకరణ లేదా మౌలిక వసతుల నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా వీలైనంత త్వరగా కార్యకలాపాలను పరిశ్రమలు ప్రారంభిస్తాయి.

# ఇంద్రకీలాద్రిపై అన్నదానానికి లక్ష విరాళం..

విజయవాడ మార్చి 20: విజయవాడలోని ఇంద్రకీలాద్రి పై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం లో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి కానూరు, చలసాని నగర్‌కు చెందిన వై. శ్రీరామ్, మేఘన చౌదరి దంపతులు రూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు) విరాళంగా అందజేశారు.

దేవస్థాన ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులు రామబ్రహ్మం సూచన మేరకు, దాతలు స్వయంగా ఆలయ అధికారులను కలిసి ఈ విరాళాన్ని సమర్పించారు. భక్తులకు నిత్యం ఉచితంగా భోజనం అందించే అన్నదాన కార్యక్రమానికి ఈ విరాళం ఉపయోగపడనుంది. వీరికి అధికారులు అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేయగా వేద ఆశీర్వానంతరం ఎఈఓ ఎన్ రమేష్ టెస్ట్ బోర్డ్ సభ్యులు అమ్మవారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు.

# ఇంద్రకీలాద్రిపై వైభవంగా వసంత నవరాత్రులు..

## -కనకాంబరాలు, గులాబీలతో జగన్మాతకు విశేష పుష్పార్చన

## -కలెక్టర్ లక్ష్మీశ దంపతుల ప్రత్యేక పూజలు



విజయవాడ మార్చి 20: విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ పరాభవ నామ సంవత్సర వసంత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.

ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండవ రోజు పూజా మండపంలో జగన్మాతకు విశేష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా జరిగిన ఈ పుష్పార్చనలో అమ్మవారిని కనకాంబరాలు, గులాబీ పూలతో అద్భుతంగా అలంకరించి అర్చించారు.

పుష్పాల సుగంధాలతో నిండిన ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ సేవను దర్శించేందుకు భక్తులు భారీగా తరలివచ్చి భక్తి పరవశంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ దంపతులు అమ్మవారికి పుష్పాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇదే రోజున డా. లక్ష్మీశ విజయవాడ నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించడం విశేషంగా నిలిచింది. ఒకవైపు పరిపాలన బాధ్యతలు చేపడుతూ, మరోవైపు అమ్మవారి సేవలో పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తృ మండలి సభ్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అద్దాలు పగలగొట్టి కారులో సొమ్ము అపహరణ.

బోధన్, మార్చి 20: బ్యాంకులో పని చేసుకుని ముగించుకొని బయటకు వచ్చేలోపు కారులో అద్దాలు పగలగొట్టి అందులో నగదు చోరీ చేసిన సంఘటన బోధన్ పట్టణంలో శుక్రవారం జరిగింది. పట్టణానికి చెందిన హరిబాబు అనే వ్యక్తి కారులో మూడు లక్షల నగదు ఉంచి యూనియన్ బ్యాంకులో పని నిమిత్తం లోనికి వెళ్లాడు. బ్యాంకులో 10 నిమిషాలలో పని ముగించుకుని బయటకు వచ్చేలోపు గుర్తుతెలియని వ్యక్తులు కారు అద్దాలు పగలగొట్టి అందులో ఉన్న నగదును దోచుకున్నారు.

కవర్ లో నగదు ఉంచి కారులో తాళం వేసి లోనికి వెళ్లి వచ్చేలోపు ఈ ఘటన జరిగినట్లు హరిబాబు పోలీసులకు వివరించారు. పట్టణ ఎస్ హెచ్ ఓ వెంకటనారాయణ సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పార్టీ పటిష్టతకు కృషి

## -ప్రభుత్వ విప్ విజయ రమణారావు

కరీంనగర్, 20: ప్రభుత్వ విప్ గా నియమించినందుకు



పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేసారు. శుక్రవారం హైదరాబాదులో కలిసి తనపై నమ్మకం ఉంచి విప్ పదవి కట్టబెట్టినందుకు ముఖ్యమంత్రిని శాలువా వేసి సత్కరించారు.

తన నియామకానికి సహకరించిన పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు మంత్రుల కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ పటిష్టతకు తనవంతు చేస్తానని తెలియజేశారు.

# పార్లమెంటులో ప్రశ్న: భారత్‌లో ఉపగ్రహ ప్రయోగ సదుపాయాల అభివృద్ధి

న్యూఢిల్లీ, మార్చి 20:ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరి కోటలో గల సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం (ఎస్‌డీఎస్‌సీ)లో ప్రస్తుతం రెండు ప్రయోగ సదుపాయాలు పనిచేస్తున్నాయి. అవి.. ఫస్ట్ లాంచ్ ప్యాడ్ (ఎఫ్ఎల్‌పీ), సెకండ్ లాంచ్ ప్యాడ్ (ఎస్ఎల్‌పీ). పీఎస్ఎల్‌వీ, ఎస్ఎస్ఎల్‌వీలను ప్రయోగించడానికి ఎఫ్ఎల్‌పీ ఉపయోగపడు తోంది. పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, ఎల్‌వీఎమ్3.. వీటిని ప్రయోగించడానికి ఎస్ఎల్‌పీని ఉపయోగిస్తున్నారు. శ్రీహరి కోట లోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో థర్డ్ లాంచ్ ప్యాడ్ (టీఎల్‌పీ)ని ఏర్పాటు చేసే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం 2025 లో ఆమోదించింది. ఇది ఇస్రోకు చెందిన తదుపరి తరం లాంచ్ వెహికిల్స్‌ను (ఎన్‌జీఎల్‌వీ) ప్రయోగించడానికి తోడ్పడుతుంది. టీఎల్‌పీని 2029-30 కల్లా ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

చిన్న కృత్రిమ ఉపగ్రహ లాంచ్ వెహికిల్‌ను సూర్య-స్థిర ధృవ కక్ష్య (సన్-సింక్రోనస్ పోలార్ ఆర్బిట్.. ఎస్ఎస్‌పీఓ)లోకి పంపడానికి రెండో లాంచ్ సైటును ఎస్ఎస్ఎల్‌వీ లాంచ్ కాంప్లెక్స్ (ఎస్ఎల్‌సీ) పేరుతో తమిళనాడులోని కులశేఖర పట్టణంలో ఏర్పాటు చేస్తున్నారు.

ఎస్ఎస్‌పీఓ ను ముఖ్యంగా భూగ్రహ పరిశీలనకు నియోగించే అవకాశం ఉంది. రెండో లాంచ్ సైట్ సేవలను 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొదలుపెట్టే సూచనలు ఉన్నాయి.

లాంచ్ ప్యాడ్, సంబంధిత సదుపాయాల స్థాపనకూ లేదా విస్తరణకూ గత అయిదు సంవత్సరాల్లో మంజూరు చేసిన, విడుదల చేసిన, ఉపయోగించిన నిధుల వివరాలను అనుబంధ పత్రం - ఎ లో గమనించవచ్చు.

భూమిని పరిశీలించడానికి ఉద్దేశించిన మానవ నిర్మిత ఉపగ్రహాలను తీసుకుపోయే చెరో మూడు పీఎస్ఎల్‌వీ, ఎస్ఎస్ఎల్‌వీ మిషన్లను 2026-27లో ఎఫ్ఎల్‌పీ నుంచి ప్రయోగించడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. కమ్యూనికేషన్, నేవిగేషన్ శాటిలైట్లను తీసుకుపోయే జీఎస్ఎల్‌వీ, ఎల్‌వీఎం3 లకు చెందిన చెరో రెండు మిషన్లను కూడా 2026-27 లోనే ప్రయోగించాలన్న ప్రణాళిక కూడా ఉంది.

ఎన్‌జీఎల్‌వీకి చెందిన తొలి గగనయానాన్ని 2031-32లో మూడో లాంచ్ ప్యాడ్ (టీఎల్‌పీ) నుంచి ప్రారంభించాలనుకుంటున్నారు. ఎస్ఎస్ఎల్‌వీ ప్రయోగాలని 2027-28లో తమిళనాడులోని కులశేఖరపట్టణం సెకండ్ లాంచ్ సైట్ నుంచి నిర్వహించే అవకాశం ఉంది.

ప్రస్తుతానికి, మరేదైనా ప్రయోగ సదుపాయాన్ని దేశంలో వేరే ఏ చోటనైనా ఏర్పాటు చేసే ప్రతిపాదనేదీ అంతరిక్ష విభాగం (డీఓఎస్) పరిశీలనలో లేదు.

కేంద్ర ప్రభుత్వం 2020 జూన్‌లో ప్రకటించిన అంతరిక్ష రంగ సంస్కరణలు ప్రయోగ సంబంధిత మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం సహా, అంతరిక్ష కార్యకలాపాల పూర్తి స్థాయి నిర్వహణకు అనుమతి స్తాయి. దీనిలో భాగంగా, అంతరిక్ష రంగంలో ప్రభుత్వేతర సంస్థ (ఎన్‌జీఈ)ల కార్య కలాపాలను ప్రోత్సహించడానికీ, ఆ కార్యకలాపాలకు సాధికారతను కల్పించడానికీ, పర్యవేక్షించడానికీ ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్, ఆథరైజేషన్ సెంటర్ (ఐఎన్-ఎస్‌పీఏసీఈ.. 'ఇన్-స్పేస్')ని స్థాపించారు. ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక వ్యవహారాల విభాగం 2024 ఏప్రిల్ 16 నాటి గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం, అంతరిక్ష ప్రయోగ సంబంధిత మౌలిక సదుపాయాల అభివృద్ధిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)ని అనుమతిస్తారు.

# 5 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో హింసకూ, కవ్వింపులకూ తావు లేకుండా

# ఎన్నికల నిర్వహణకు 25 లక్షల మందికి పైగా అధికారులను నియమించిన ఈసీఐ

న్యూఢిల్లీ, మార్చి 20: అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ విధాన సభలకు సాధారణ ఎన్నికలతో పాటు 6 రాష్ట్రాల్లో ఉపఎన్నికలకు సంబంధించిన షెడ్యూలును భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) 2026 మార్చి నెల 15న ప్రకటించింది.

5 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో వివిధ దశల్లో ఎన్నికలను సాఫీగానూ, క్రమపద్ధతిలోనూ నిర్వహించేందుకు 25 లక్షల మందికి పైగా ఎన్నికల అధికారులను నియమించారు. ఈ ఎన్నికలలో ఓటు వేయడానికి అర్హులైన ఓటర్లు మొత్తం 17.4 కోట్ల కన్నా ఎక్కువ మంది ఉన్నారు. ఈ లెక్కన దాదాపు ప్రతి 70 మంది ఓటర్లకు ఒక ఎన్నికల అధికారి చొప్పున నియమించినట్లయింది.

విధులను పూర్తి నిష్పాక్షికంగా నిర్వర్తించాలని, ఎన్నికలను హింసకీ, కవ్వింపులకీ తావు లేకుండా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని, అలా జరిగినప్పుడే ప్రతి ఒక్క ఓటరూ ఎలాంటి భయానికీ, ఒత్తిడికీ లోను కాకుండా తన ఓటును వేయగలుగుతారని ఎన్నికల ప్రధానాధికారి శ్రీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల షెడ్యూలును ప్రకటించిన సందర్భంగా స్పష్టం చేశారు.

ఎన్నికలకు నియమించిన ఉద్యోగుల్లో.. సుమారు 15 లక్షల మంది పోలింగ్ సిబ్బంది, 8.5 లక్షల మంది భద్రతా సిబ్బంది, 40 వేల మంది ఓట్ల లెక్కింపు సిబ్బంది, 49 వేల మంది సూక్ష్మ పరిశీలకులు, 21 వేల మంది సెక్టర్ అధికారులు, 15 వేల మంది ఓట్ల లెక్కింపునకు సంబంధించి సూక్ష్మ పరిశీలకులుగా పనిచేసే వారితో పాటు ఇతర అధికారులు కూడా ఉన్నారు.

ఓటర్లకు ఫోన్ కాల్ మాధ్యమం ద్వారానూ, ఈసీఐనెట్ యాప్ (ఇఅఎఔవబి ంజూజూ) లో 'బుక్-ఎ-కాల్ టు బీఎల్ఓ' సదుపాయం ద్వారానూ 2.18 లక్షల కన్నా ఎక్కువ మంది బూత్ స్థాయి అధికారుల (బీఎల్ఓల)తో పాటు క్షేత్ర స్థాయి ఎన్నికల యంత్రాంగం కూడా అందుబాటులో ఉంది. డీఈఓ/ఆర్ఓ స్థాయిలో ఏదైనా ఫిర్యాదును గాని, ప్రశ్నను గాని నమోదు చేయడానికి కాల్ సెంటర్ నంబరు +91 (ఎస్టీడీ కోడ్) 1950 కూడా అందుబాటులో ఉంది.

ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 28ఏ నిబంధనల ప్రకారం నియమించిన ఉద్యోగులందరినీ ఎన్నికల సంఘంలో డిప్యుటేషన్లో ఉన్నట్లుగా పరిగణిస్తారు.

సాధారణ ఎన్నికలతో పాటు ఉప ఎన్నికల కాలంలో ఎన్నికల సంఘం పర్యవేక్షణకు గాను 832 విధానసభ నియోజకవర్గాల్లో 1,111 మంది కేంద్ర పర్యవేక్షకులను నియమించారు. వీరిలో 557 మంది సాధారణ పరిశీలకులు, 188 మంది పోలీసు పరిశీలకులతో పాటు 366 మంది వ్యయ పరిశీలకులు కలిసివున్నారు.

# 2023-24 సీజన్‌కు సీసీఐకి రూ. 1,718.56 కోట్ల

# ఎంఎస్‌పీ నిధుల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం...

న్యూఢిల్లీ, మార్చి 20:రైతు సంక్షేమాన్ని బలోపేతం చేస్తూ, ఆత్మనిర్భర భారత్ లక్ష్య సాధన దిశగా పురోగమించేలా.. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. 2023-24 పత్తి సీజనుకు గాను భారత పత్తి సంస్థకు రూ.1,718.56 కోట్ల కనీస మద్దతు ధర నిధులను కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. మద్దతు ధరతో దేశవ్యాప్తంగా ఉన్న పత్తి రైతులకు అండగా నిలవడం ఈ నిధుల ముఖ్యోద్దేశం.

కనీస మద్దతు ధర కన్నా మార్కెట్ ధరలు తక్కువగా ఉన్న సమయంలో.. పత్తి రైతుల ప్రయోజనాలను కాపాడడం ఎంఎస్‌పీ కార్యకలాపాల ప్రధాన లక్ష్యం. పత్తి ధరలను స్థిరీకరించడంలో, రైతులు తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోకుండా నిరోధించడంలో, వారికి లాభదాయకమైన ధరను అందించడంలో ఈ చర్యలు కీలక పాత్ర పోషిసాయి. వ్యవసాయ మార్కెట్లలో సమ్మిళితత్వాన్ని పెంపొందించడం ద్వారా.. పత్తి రైతుల ఆర్థిక భద్రతకు ఈ ఎంఎస్‌పీ కార్యకలాపాలు ఎంతగానో దోహదపడతాయి.

దేశంలోని అత్యంత కీలకమైన వాణిజ్య పంటల్లో పత్తి ఒకటి. ఇది దాదాపు 60 లక్షల మంది రైతులకు జీవనోపాధిని కల్పిస్తోంది. అంతేకాకుండా మరో నాలుగైదు కోట్ల మంది పత్తి ప్రాసెసింగ్, వర్తకం, జౌళీ పరిశ్రమ వంటి అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు.

2023-24 పత్తి సీజనులో సాగు విస్తీర్ణం దాదాపు 114.47 లక్షల హెక్టార్లుగా ఉందని అంచనా. అందులో 325.22 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి అయినట్లు లెక్కతేల్చారు. ప్రపంచవ్యాప్తంగా పత్తి ఉత్పత్తిలో ఇది దాదాపు 25 శాతానికి సమానం. వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ (సీఏసీపీ) సిఫార్సుల ఆధారంగా విత్తన పత్తి (కపాస్)కి కనీస మద్దతు ధరను భారత ప్రభుత్వం నిర్ణయిస్తుంది.

పత్తి పంటకు సంబంధించి కనీస మద్దతు ధర కార్యకలాపాల నిర్వహణ కోసం 'కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా'ను కేంద్ర నోడల్ ఏజెన్సీగా భారత ప్రభుత్వం నియమించింది. మద్దతు ధర కన్నా మార్కెట్ ధరలు తక్కువగా ఉన్న సమయంలో.. తగిన సగటు నాణ్యతా ప్రమాణాల (ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ - ఎఫ్ఏక్యూ) మేరకు ఉన్న పత్తిని రైతుల నుంచి సీసీఐ కొనుగోలు చేస్తుంది. ఈ కొనుగోలుపై గరిష్ఠ పరిమితి ఏదీ లేదు. తద్వారా రైతులకు భరోసానిచ్చే రక్షణ కవచంగా నిలుస్తుంది.

కొనుగోలు సన్నద్ధతలో భాగంగా పత్తి పండించే 11 ప్రధాన రాష్ట్రాల్లో ఒక బలమైన వ్యవస్థను సీసీఐ ఏర్పాటు చేసింది. 152 జిల్లాల్లో 508కి పైగా ఎక్కువ కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తేవడం ద్వారా.. ఎలాంటి అంతరాయమూ లేని, సులభతరమైన కొనుగోలు సౌకర్యాన్ని రైతులకు కల్పిస్తోంది.

ఎంఎస్‌పీ కార్యకలాపాల సామర్థ్యాన్నీ, పారదర్శకతనూ పెంచడం కోసం పలు సాంకేతిక, రైతు కేంద్రీకృత చర్యలను సీసీఐ చేపట్టింది. ఇందులో భాగంగా ఎంఎస్‌పీకి సంబంధించిన సమాచారానికి విస్తృత ప్రాచుర్యాన్ని కల్పించడం, బేల్ ఐడెంటిఫికేషన్, ట్రేసబిలిటీ సిస్టమ్ (బీఐటీఎస్)ను అమలు చేయడం, 'కాట్ అలై' మొబైల్ యాప్ ప్రారంభం వంటి చర్యలును చేపట్టింది. మరింత మెరుగ్గా రైతులను చేరుకోవడంలోనూ, వారికి మెరుగైన సేవలందించడంలోనూ ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి.

# జోరుగా కొనసాగుతున్న ఎంపిఎల్ క్రికెట్ టోర్నీ



మక్తల్, మార్చి 20: మక్తల్ మండలంలోని మంథన్ గోడ్ గ్రామంలో ఉగాది పర్వదినం సందర్భంగా క్రికెట్ పోటీలు జోరుగా కొనసాగుతు న్నాయి. ఛత్రపతి శివాజీ టీం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా నియోజకవర్గ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉప్పరి అశోక్ సాగర్, గ్రామానికి చెందిన గువ్వల తిరుపతి విజేత లకు బహుమతులు అందించనున్నారు .పోటీలు రెండవ రోజైన శుక్రవారం బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉప్పరి అశోక్ సాగర్ ఐదు టీమ్లకు గాను మొత్తం 75 మంది ప్లేయర్లకు తన సొంత ఖర్చులతో జెర్సీలను అందజేశారు.

అనంతరం ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని యువతను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఎంపిఎల్ క్రికెట్ టోర్నీ నిర్వహించడం జరుగుతుందన్నారు .పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారు కూడా క్రీడా స్ఫూర్తితో పోటీల్లో ముందుకు సాగాలని సూచించారు. క్రీడల్లో గెలుపు ఓటములు అనేవి సహజంగా జరుగుతుంటాయి అన్నారు.

నేటి ఓటమి కూడా రేపటి విజయానికి సోపానంగా భావించాలని ఆయన క్రీడాకారులకు సూచించారు .

# నిడుగుర్తిలో మైనార్టీలకు రంజాన్ తోఫా పంపిణీ..



ఆదిలాబాద్, మార్చి 20: నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోనినిడుగుర్తి మజీద్ వద్ద పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం మంజూరు చేసిన రంజాన్ తోఫా సర్పంచ్ రాములు, ఉప సర్పంచ్ సంతోష్, మాజీ ఎంపిటీసి కృష్ణారెడ్డి శుక్రవారం మైనార్టీ సోదరులకు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పండగలు అందరూ సమానంగా జరుపుకోవాలనే లక్ష్యంతో ధనిక పేద తారతమ్య భేదాలు లేకుండా అందరూ సమానంగా జరుపుకునేందుకు రంజాన్ తోఫా పంపిణీ చేస్తుందని అన్నారు.

మైనార్టీ సోదరులు నెల రోజులపాటు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపడుతారని రంజాన్ పండగ భక్తి భావనకు నిదర్శనమని పండుగ శాంతియుత వాతావరణం లో ఘనంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ మహమూద్, నాయకులు నారాయణరెడ్డి, రాజు గౌడ్ మైనార్టీలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర సమాచార-ప్రసార శాఖ కార్యదర్శి ఐఐసీటీ సందర్శన..

## విస్తరణ ప్రణాళికలు... కంటెంట్ క్రియేటర్ ల్యాబ్ ప్రణాళికపై సమీక్ష

న్యూఢిల్లీ, మార్చి 20:కేంద్ర సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు ఇవాళ ముంబయిలో 'ఎన్ఎఫ్‌డీసీ' ప్రాంగణంలోగల 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్' (ఐఐసీటీ)ని సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ వృద్ధి పథం, విస్తరణ ప్రణాళికలను ఆయన సమీక్షించారు.

శ్రీ జాజు అధ్యక్షత వహించిన ఈ సమీక్షా సమావేశంలో బోర్డు సభ్యులందరితోపాటు పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. సంస్థ సారథ్య బృందంతో వారి వ్యూహాత్మక భవిష్యత్ ప్రణాళికపై శ్రీ జాజు కూలంకషంగా చర్చించారు. సృజనాత్మక, డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్లో మారుతున్న అవసరాలను తీర్చడానికి ఐఐసీటీ విద్యా కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల విస్తరణపై ప్రధానంగా చర్చ కేంద్రీకృతమైంది. పారిశ్రామిక, విద్యాసంస్థల సహకారం బలోపేతం లక్ష్యంగా కొనసాగుతున్న కార్యక్రమాలను కూడా ఆయన సమీక్షించారు.

శ్రీ జాజు మాట్లాడుతూ- "ఐఐసీటీలో మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయి.. సుమారు 150 మంది విద్యార్థులు ఇప్పటికే అధ్యయన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ క్రమంలో జూలై నాటికి 400 మంది విద్యార్థులతోపాటు ప్రత్యక్షంగా 20, వర్చువల్ విధానంలో మరిన్ని అంకుర సంస్థలను జోడించడమే లక్ష్యం. ఈ సంస్థ నిర్మాణ, నిర్మాణానంతర పనుల కోసం అత్యుత్తమ నాణ్యత గల మౌలిక సదుపాయాలను సమకూరుస్తుంది" అన్నారు. ప్రస్తుతం, ఐఐసీటీలో 11 అంకుర సంస్థల సంపోషణ కొనసాగుతున్నదని కూడా ఆయన పేర్కొన్నారు. గోరేగావ్‌లోని ఫిల్మ్ సిటీలో త్వరలో ఒక పెద్ద ప్రాంగణాన్ని రూపొందిస్తున్నామని, 2028కల్లా అక్కడ తరగతులు ప్రారంభం కాగలవని శ్రీ జాజు తెలిపారు.

సమావేశంలో చర్చల గురించి ప్రస్తావిస్తూ- కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన విజువల్ గేమింగ్, వీఎఫ్ఎక్స్, కంటెంట్ క్రియేషన్ ల్యాబ్‌ల అంశంపైనా పరిశ్రమ ప్రతినిధులతో చర్చించినట్లు శ్రీ జాజు చెప్పారు. సృజనాత్మక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించామన్నారు. గత సంవత్సరం వేవ్స్ సమ్మిట్‌లో "సృజనాత్మక వ్యవస్థ" (ఆరెంజ్ ఎకానమీ) కార్యక్రమం కింద కంటెంట్ క్రియేషన్, సృజనాత్మక రంగాలలో 20 లక్షల మందిని అనుసంధానించాలని లక్ష్యనిర్దేశం చేసుకున్నారు. ఈ దిశగా చేపట్టాల్సిన చర్యలపైనా నేటి చర్చల్లో దృష్టి సారించామని శ్రీ జాజు తెలిపారు.

దేశవ్యాప్తంగా 15,000 సెకండరీ పాఠశాలలు, 500 కళాశాలల్లో కంటెంట్ క్రియేటర్స్ ల్యాబ్స్ ఏర్పాటు ప్రతిపాదనపై చర్చ ఈ పర్యటనలో ఓ కీలకాంశం. డిజిటల్ సృజనాత్మకతకు ప్రోత్సాహం, మీడియా అవగాహన పెంపు, క్రియేటర్ ఎకానమీలో భవిష్యత్ అవకాశాలకు అనుగుణంగా విద్యార్థులకు కంటెంట్ ప్రొడక్షన్ నైపుణ్య కల్పన ఈ కార్యక్రమం లక్ష్యాలు.

ఇన్‌స్టిట్యూట్‌లోని అత్యాధునిక సౌకర్యాలతోపాటు అక్కడి శిక్షణ కార్యక్రమాలు, ప్రొడక్షన్ మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణ హబ్‌లను శ్రీ జాజు సందర్శించారు. ఈ సందర్భంగా బోర్డు సభ్యులతో సంభాషిస్తూ దేశీయ సృజనాత్మక ప్రతిభా వ్యవస్థ వృద్ధిలో ఐఐసీటీ పాత్రపై అభిప్రాయాలను వారితో పంచుకున్నారు.

ఈ ఇన్‌స్టిట్యూట్ ప్రస్తుతం యానిమేషన్, గేమింగ్, పోస్ట్-ప్రొడక్షన్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ విభాగాలలో 18 ప్రత్యేక కోర్సులను అందిస్తోంది. వీటిలో గేమింగ్‌లో 6, పోస్ట్-ప్రొడక్షన్‌లో 4, యానిమేషన్, కామిక్స్, 'ఎక్స్ఆర్'లలో 8 వంతున కోర్సులున్నాయి. కీలక కార్యక్రమాల్లో యానిమేషన్ ఫిల్మ్ డిజైన్, ఇంటరాక్టివ్ వీడియో గేమ్ డిజైన్-డెవలప్‌మెంట్, పోస్ట్ ప్రొడక్షన్, విజువల్ ఎఫెక్ట్స్ తదితరాల్లో 24 నెలల అండర్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు కూడా ఉన్నాయి.

అంతేకాకుండా 3డీ క్యారెక్టర్ డిజైన్, విజువల్ ఎఫెక్ట్స్, సినిమాటిక్ వర్చువల్ రియాలిటీ, ఫిల్మ్ మేకింగ్, ఈ-స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్, ఫిల్మ్ మేకింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల్లోనూ 3 నుంచి 6 నెలల స్వల్పకాలిక డిప్లొమా-సర్టిఫికెట్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి.

డిజిటల్ సృజనాత్మకతకు ప్రోత్సాహం, వేగంగా వృద్ధి చెందుతున్న భారత మీడియా-వినోద రంగానికి మద్దతు దిశగా సంస్థాగత చట్రాల బలోపేతంపై కేంద్ర సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ ప్రాధాన్యాన్ని శ్రీ జాజు సందర్శన స్పష్టం చేసింది.

ఐఐసీటీ సందర్శనలో భాగంగా 'నేషనల్ మ్యూజియం ఆఫ్ ఇండియన్ సినిమా (ఎన్ఎంఐసీ)ను కూడా పరిశీలించిన కేంద్ర సమాచార-ప్రసార శాఖ కార్యదర్శి శ్రీ జాజు, అక్కడి పాఠశాల విద్యార్థుల ప్రతినిధి బృందంతో కొద్దిసేపు ముచ్చటించారు.

## టీవీ ప్రసారాలపై వచ్చే ఫిర్యాదులను సమర్థవంతంగా, నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించేందుకు మూడు అంచెల ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం

న్యూఢిల్లీ, మార్చి 20:ప్రస్తుత నియంత్రణ చట్రం ప్రకారం ప్రైవేటు శాటిలైట్ టీవీ ఛానెళ్లలో ప్రసారమయ్యే అన్ని ప్రకటనలు, కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్‌ల (నియంత్రణ) చట్టం 1995, దాని కింద రూపొందించిన నిబంధనల ప్రకారం నిర్దేశించిన ప్రకటనల నియమావళికి కట్టుబడి ఉండాలి. ప్రకటనల నైతిక నియామావళి (కోడ్) ఇతర విషయాలతోపాటు ఈ కింది విధంగా నిర్దేశిస్తుంది.

కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ (సవరణ) నియమాలు 2021లోని నిబంధన 16 ప్రకారం ఏదైనా టీవీ ఛానల్‌లో ప్రసారమయ్యే కంటెంట్ ప్రకటనల నియామావళికి విరుద్ధంగా ఉన్నాయని భావిస్తే బాధితులు నేరుగా సంబంధిత టీవీ సంస్థకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు. ఒకవేళ ఆ ఫిర్యాదు అడ్వర్టైజింగ్ స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన నిబంధనలకు సంబంధించినదైతే కౌన్సిల్‌కు ఫిర్యాదును పంపాలి. ఏఎస్‌సీఐ తన సొంత నిబంధనల ప్రకారం ఆ ఫిర్యాదును విచారించి, అందిన 60 రోజుల్లోపు తుది నిర్ణయం తీసుకోవాలి. ఆ నిర్ణయాన్ని సంబంధిత టీవీ యాజమాన్యానికి, ఫిర్యాదుదారుడికి వెంటనే తెలియజేయాల్సి ఉంటుంది.

టెలివిజన్ ప్రసారాలు ప్రకటనల నియామావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను విచారించడానికి కేంద్ర ప్రభుత్వం ఒక అంతర విభాగ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు ప్రకటనల నియామావళిని ఉల్లంఘించినట్లు రుజువైన ప్రైవేటు టీవీ ఛానళ్లపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా ఛానళ్లకు సూచనలు జారీ చేయడం, హెచ్చరికలు పంపడం, క్షమాపణలు కోరుతూ స్క్రోలింగ్ ప్రదర్శించమనడంతోపాటు పలు సందర్భాల్లో ప్రసారాలను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేయడం వంటి చర్యలు ఉంటాయి. దీనితో పాటు టెలివిజన్ సంస్థలు ప్రకటనల నియామావళిని తప్పనిసరిగా పాటించేలా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు తగిన సూచనలను జారీ చేస్తుంది.

# భారతీయ విమానయానంలో ప్రయాణికులకు అందించే సౌకర్యాలు బలోపేతం

న్యూఢిల్లీ, మార్చి 20:ఉడాన్ పథకం ద్వారా విమానయానం అందరికీ అందుబాటులోకి రావడంతో అంతర్జాతీయంగా మూడో అతి పెద్ద దేశీయ విమానయాన మార్కెట్‌గా భారత్ ఆవిర్భవించింది. భారతీయ విమానాశ్రయాల ద్వారా రోజుకు అయిదు లక్షల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇది ఈ రంగంలో సాధించిన వృద్ధిని సూచిస్తుంది.

ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడమే పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు అత్యంత ప్రాధాన్యమైన అంశం. దీనికి కట్టుబడి ఉంటూ.. ప్రయాణికులే కేంద్రంగా, వారికి ప్రయాణ సౌలభ్యాన్ని కల్పిస్తూ అనేక కార్యక్రమాలను మంత్రిత్వశాఖ ప్రారంభిం చింది. వీటిలో చౌక ధరలకే ఆహారాన్ని అందించే ఉడాన్ యాత్రి కేఫ్‌లు, ఉచితంగా పుస్తకాలు చదివేందుకు ఫ్లైబ్రరీ, విమానాశ్రయాల్లో ఉచిత వైఫై తదితర సౌకర్యాలున్నాయి.

ప్రయాణికులకు సౌకర్యాన్ని, విమానయాన సంస్థల్లో పారదర్శకతను, అవి అనుసరించే పద్ధతుల్లో ఏకరూపతను తీసుకొచ్చేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ద్వారా మంత్రిత్వ శాఖ దిగువ పేర్కొన్న ఆదేశాలను జారీ చేసింది.

అందరికీ విమాన ప్రయాణాన్ని అందుబాటులో ఉంచడం కోసం ఏ విమానంలోనైనా 60 శాతం సీట్లను ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా కేటాయించాలి.

ఒకే పీఎన్ఆర్ ఉన్న ప్రయాణికులు పక్కపక్కనే ఉన్న సీట్లలో కూర్చొని ప్రయాణించవచ్చు.

భద్రత, నిర్వహణ నియంత్రణలకు లోబడి క్రీడా సామగ్రి, సంగీత సాధనాలను పారదర్శకమైన, ప్రయాణికులకు అనుకూలమైన పద్ధతిలో రవాణా చేయాలి. పెంపుడు జంతువుల రవాణాకు సంబంధించి సైతం స్పష్టమైన, పారదర్శకమైన విధానాలను విమానయాన సంస్థలు రూపొందించాలి.

విమానాల ఆలస్యం, రద్దు, బోర్డింగు నిరాకరించడం లాంటి ముఖ్యమైన సందర్భాల్లో ప్రయాణికుల హక్కులకు సంబంధించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలి.

విమానయాన సంస్థల వెబ్‌సైట్‌లు, మొబైల్ అప్లికేషన్‌లు, బుకింగ్ వేదికలు, విమానాశ్రయ కౌంటర్లలో ప్రయాణికుల హక్కులను స్పష్టంగా ప్రదర్శించాలి.

విస్తృత స్థాయిలో విమానయానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి, అవగాహన పెంపొందించడానికి ప్రాంతీయ భాషల్లో ప్రయాణికులకు హక్కుల గురించి స్పష్టంగా వివరించాలి.

ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ అనుభవాన్ని కల్పించేందుకు, పారదర్శకతను పెంపొందించేందుకు, ఫిర్యాదులను తగ్గించేందుకు, విమానయాన రంగంలో అత్యున్నత స్థాయి భద్రతా ప్రమాణాలను అనుసరించేందుకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉంది.

## బసంత్ నగర్ విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోవాలి..



కరీంనగర్, 20: టీజీ ఎన్పీడీసీఎల్ పెద్దపల్లి సర్కిల్ పరిధి బసంత్ నగర్ ఆపరేషన్ ఏఈ మానాల ప్రసాద్ పై చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. స్వామి డిమాండ్ చేశారు.

విద్యుత్ సబ్ స్టేషన్లలో పని చేస్తున్న ఆపరేటర్ల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ బెదిరిస్తున్నారని ఏఈ ప్రవర్తన సరిగా లేదని విచారణ జరిపి శాఖా పరమైన చర్యలు చేపట్టాలని శుక్రవారం పెద్దపల్లి మండలం రాఘవపూర్ లో గల ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆపరేటర్లు, యూనియన్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు.

ఆపరేటర్లను కక్ష్య పూరితంగా వేధిస్తున్నారని ఎస్ఈ గంగాధర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఏఈ తీరుతో సబ్ స్టేషన్లలో పనిచేసే ఆపరేటర్లు భయాందోళన చెందుతున్నారని వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో మద్యం మత్తులో ఏఈ సబ్ స్టేషన్ లను సందర్శించి ఆపరేటర్లను ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు.

ఏఈ వైఖరిపై తక్షణమే విచారణ జరిపి ఆపరేటర్లకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజీ ఎన్పీడిసిఎల్ కంపెనీ ప్రెసిడెంట్ జి.ఆంజనేయులు, రీజనల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాగు నాయక్, సిహెచ్ నర్సయ్య, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండయ్య, కె.నరేష్, పెద్దపల్లి సర్కిల్ గౌరవ అధ్యక్షులు భిక్షపతి, మంథని డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్, సర్కిల్ పరిధిలోని ఆపరేటర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# విజయవాడలో 'సురక్షా సంకల్ప కార్యశాల' : జిల్లాల వారీగా హెచ్ఐవీపై పోరాటం




న్యూఢిల్లీ, మార్చి 20:హెచ్ఐవి నియంత్రణలో పురోగతిని వేగవంతం చేసే జాతీయ స్థాయి ప్రయత్నాల్లో భాగంగా, 18 మార్చి 2026న ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో రాష్ట్ర స్థాయి 'సురక్షా సంకల్ప కార్యశాల' నిర్వహించారు. భారత ప్రభుత్వ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (ఔంఅూ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వర్క్‌షాప్‌కు ఎన్ఏసీఓ (ఔంఅూ) డైరెక్టర్ జనరల్ మరియు భారత ప్రభుత్వం, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ. అదనపు కార్యదర్శి, డాక్టర్ రాకేశ్ గుప్త అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ంఖూంఅూ) ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కే. నీలకంఠ రెడ్డితో పాటు ఎన్ఏసీఓ, రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

ఈ కార్యశాల 'మిషన్ ఎయిడ్స్ సురక్ష' కింద ప్రాధాన్యత కలిగిన రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న వరుస సమీక్షలు, వ్యూహాత్మక సమావేశాలలో ఒక భాగం. జిల్లా స్థాయిలో హెచ్ఐవి (ఊఎం) నియంత్రణ చర్యలను బలోపేతం చేసేందుకు భారత ప్రభుత్వం తీసుకుంటున్న వేగవంతమైన, లక్ష్యిత విధానానికి ఇది నిదర్శనం. ఒకదాని తర్వాత ఒకటిగా పలు రాష్ట్రాలను సమీక్షిస్తూ, హెచ్ఐవి వ్యాప్తి ఎక్కువగా ఉన్న జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం. ఎక్కడైతే కార్యక్రమాలను బలోపేతం చేయడం ద్వారా స్పష్టమైన మార్పు తీసుకురావచ్చో, అటువంటి జిల్లాల్లో చర్యలను మరింత వేగవంతం చేయాలని ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం వయోజనుల హెచ్ఐవీ (ఊఎం) వ్యాప్తి 0.58 శాతంగా ఉంది. సుమారు 3,10,451 మంది హెచ్ఐవీతో జీవిస్తున్నట్లు అంచనా, అందుకే జాతీయ స్థాయి హెచ్ఐవీ నియంత్రణ చర్యల్లో ఏపీకి అత్యంత ప్రాధాన్యత ఉంది. ఇటీవలి గణాంకాల ప్రకారం, జాతీయ హెచ్ఐవీ కార్యక్రమం కింద గుర్తించిన 'ప్రాధాన్య జిల్లాల' జాబితాలో ఆంధ్రప్రదేశ్ ను ప్రాధ్యాన్య రాష్ట్రంగా గుర్తించారు. రాష్ట్రంలోని అనకాపల్లి, అనంతపురం, అన్నమయ్య, బాపట్ల, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, ఏలూరు, గుంటూరు, కాకినాడ, కృష్ణా, కర్నూలు, నంద్యాల, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, శ్రీకాకుళం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీ సత్యసాయి, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమ గోదావరి మరియు వైఎస్ఆర్ కడప.. ఇలా మొత్తం 23 జిల్లాలను ప్రత్యేక దృష్టి సారించాల్సిన ప్రాంతాలుగా గుర్తించారు. రాష్ట్రంలోని మొత్తం హెచ్ఐవీ కేసుల్లో ఈ జిల్లాల వాటానే ఎక్కువగా ఉన్నందున, ఇక్కడ డేటా ఆధారితంగా నిరంతర పర్యవేక్షణ, పటిష్టమైన చర్యలు అవసరమని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ కార్యశాలలో జిల్లా స్థాయి పరిస్థితులపై సమగ్ర సమీక్షలు నిర్వహించారు. ప్రధానంగా వ్యాధి వ్యాప్తి ధోరణులను విశ్లేషించడం, పరీక్షల పరిధిని పెంచడం, చికిత్స ప్రారంభించడం, దానిని కొనసాగించేలా చూడటం, వైరల్ లోడ్ నియంత్రణ వంటి అంశాలపై చర్చించారు. వీటితో పాటు, అత్యంత ప్రమాదంలో ఉన్న మరియు వ్యాధి బారిన పడే అవకాశం ఉన్న వర్గాల కోసం చేపడుతున్న అవగాహన కార్యక్రమాల గురించి క్షుణ్ణంగా సమీక్షించారు.

సమావేశంలో పాల్గొన్న వారిని ఉద్దేశించి డాక్టర్ రాకేశ్ గుప్త మాట్లాడుతూ.. జాతీయ హెచ్ఐవీ నియంత్రణ చర్యల్లో స్థానిక భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడం, సూక్ష్మ స్థాయి ప్రణాళిక ఎంత ముఖ్యమో వివరించారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన ఎయిడ్స్‌ను పూర్తిగా అంతం చేయాలనే లక్ష్యాన్ని చేరుకోవాలంటే.. క్షేత్రస్థాయి ఆధారాలతో కూడిన ప్రణాళికలు, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ మరియు సంబంధిత విభాగాల మధ్య సమన్వయం అవసరమని అన్నారు.

ఈ కార్యశాలలో పలు జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు (ఆఓఊబ), మరియు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారులు పాల్గొన్నారు. వారు తమ జిల్లాల్లో సాధించిన పురోగతిని వివరించడంతో పాటు, ఎక్కడెక్కడ లోపాలు ఉన్నాయో విశ్లేషించారు. హెచ్ఐవీ నియంత్రణను మరింత ఉధృతం చేసేందుకు ఆయా జిల్లాల వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించారు.

ముఖ్యంగా వ్యాధి బారిన పడే అవకాశం ఉన్న వర్గాలపై దృష్టి సారించడం, హెచ్ఐవీ పరీక్షల పరిధిని విస్తరించి వ్యాధిని త్వరగా గుర్తించడం, యాంటీ రిట్రోవైరల్ థెరపీ (ంఖీ) చికిత్సను అందరికీ సకాలంలో అందించి, వారు దానిని కొనసాగించేలా చూడటం, హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో వైరస్ ప్రభావాన్ని తగ్గించడం వంటి అంశాలపై ప్రధానంగా చర్చలు జరిగాయి.

విజయవాడలో జరిగిన ఈ సురక్షా సంకల్ప కార్యశాల ద్వారా.. జాతీయ స్థాయి '95-95-99' లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి జిల్లాకు ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ రూపొందుతుందని భావిస్తున్నారు. అంటే, హెచ్ఐవితో జీవిస్తున్న వారిలో 95 శాతం మందికి తమ పరిస్థితి గురించి తెలిసి ఉండాలి, వ్యాధి నిర్ధారణ అయిన వారిలో 95 శాతం మందికి నిరంతర చికిత్స అందాలి, చికిత్స పొందుతున్న వారిలో 99 శాతం మందిలో వైరస్ ప్రభావం అదుపులోకి రావాలి. ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన ఎయిడ్స్‌ను అంతం చేసే దిశగా భారతదేశం పెట్టుకున్న సమయ పరిమితితో కూడిన లక్ష్యాలను చేరుకోవడానికి ఈ ప్రయత్నాలు ఎంతగానో దోహదపడతాయి.

ఇలాంటి వరుస సమీక్షలు, రాష్ట్ర స్థాయి కార్యక్రమాల ద్వారా, హెచ్ఐవి నియంత్రణలో డేటా ఆధారితమైన, పటిష్టమైన విధానాన్ని 'ఎన్ఏసీఓ' (ఔంఅూ) బలోపేతం చేస్తోంది. జాతీయ లక్ష్యాల సాధనలో భాగంగా, ప్రాధాన్యత కలిగిన రాష్ట్రాల్లో జిల్లా స్థాయి అమలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటోంది.

# కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటు




హైదరాబాద్, మార్చి 20:సైక్లింగ్ క్రీడకు ప్రత్యేకత ఉన్నదని మరియు ఈ క్రీడకు విస్తృత ప్రచారం చాలా అవసరమని డాక్టర్ వి. నరేందర్ రెడ్డి గారు, చైర్మన్ కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, స్థానిక కరీంనగర్ లోని వావిలాల పల్లి లో నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియలో పాల్గొని వారు మాట్లాడారు.

×తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా కరీంనగర్ జిల్లా సైకిల్ అసోసియేషన్ కి ప్రత్యేకత ఉన్నదని మరియు ఎన్నో టోర్నమెంట్ల ను నిర్వహించి క్రీడ స్ఫూర్తిని పెంపొందించిందని వారు చెప్పారు. అదే విధంగా రాష్ట్ర సంఘానికి సైతం చేయూతనిచ్చామని మరియు వారు నిర్వహించినటువంటి వివిధ రకాల టోర్నమెంట్లను మరియు చాంపియన్షిప్ పోటీలను తరగని ఉత్సాహంతో చక్కటి సమన్వయంతో కార్యక్రమాలను సైతం జయప్రదం చేసి క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంలో చాలా కీలకంగా వ్యవహరించిందని చెప్పారు.

ఈ సందర్భంగా అధ్యక్షునిగా ఎన్నికైన మధుసూదన్ రెడ్డి గారు మాట్లాడుతూ సైక్లింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అనేక చైతన్యవంతమైన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ప్రధానంగా నిర్వహించి క్రీడా స్ఫూర్తిని పరిరక్షించామని వారు చెప్పారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం మాట్లాడుతూ 2022 నుండి 26 వరకు కరీంనగర్ జిల్లా సంఘం వారి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను ముఖ్యంగా అవగాహన కల్పించే కార్యక్రమాలకు దీటుగా వివిధ స్థాయిలలో పాల్గొనే విధంగా అనేక కార్యక్రమాలను చాలా ఆదర్శంగా చేపడుతామని మరియు నేటికీ అదే స్ఫూర్తితో పలు కార్యక్రమాలను వివిధ ప్రాంతాలను ఘనంగా నిర్వహిస్తామని వారు చెప్పారు.

ప్రజాస్వామ్య పద్ధతిలో నేడు నిర్వహించినటువంటి ఎన్నికలలో నూతన కార్యవర్గం అంతయు ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం చాలా హర్షించదగ్గ విషయమని చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిన ఎన్నికలకు పరిశీలకులుగా రాష్ట్రం నుండి ఏ.కిషన్ గారు, జిల్లా యువజన క్రీడ విభాగం నుండి పవన్ గారు, ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధి జనార్ధన్ రెడ్డి గారు, రిటర్నింగ్ ఆఫీసర్ గా, మాజీ కార్పొరేటర్ ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి టి. రమేష్ రెడ్డి గారు వ్యవహరించారని వారు చెప్పారు.

నూతనంగా అధ్యక్షునిగా డాక్టర్ కెప్టెన్ బి మధుసూదన్ రెడ్డి గారు, ప్రధాన కార్యదర్శిగా సురభి వేణుగోపాల్ గారు, కోశాధికారిగా విజగదీశ్వర చారి గారు, ఉపాధ్యక్షులుగా ఎం అరవింద్ గారు ఎస్ రాజయ్య గారు ఎస్ అనుదీప్ గారు సంయుక్త కార్యదర్శిగా ఎస్ ఇంద్రవేశ్ వీ రమేష్ జై నరేష్ మరియు తదితరులు కాని వారికి సభ్యులుగా ఎన్నుకోబడ్డారని వారు చెప్పారు×

ఈ సంఘానికి డాక్టర్ బంగారు స్వామి గారు మరియు ఎన్.కోదండరాములు ఫ్యాట్రన్స్ గా వ్యవహరిస్తారని వారు చెప్పారు× . ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు మరియు క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తామని మరియు క్రీడల పట్ల చక్కటి వైఖరిని ప్రదర్శిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు ఢ క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రీమియం పెట్రోల్ ధర రూ.2.35 పెంపు

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం ప్రపంచ ఇంధన మార్కెట్‌పై పడుతోంది. తాజాగా ప్రీమియం పెట్రోల్ ధర లీటరుకు రూ.2.35 పెరిగింది. దేశవ్యాప్తంగా వీటి ధరలను పెంచినట్టు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు శుక్రవారంనాడు ప్రకటించాయి. తక్షణం పెంచిన ధరలు అమల్లోకి వచ్చాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) 'స్పీడ్', హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) 'పవర్', ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) 'చీఖ95' పెట్రోల్ ధరలు ఆయా ప్రాంతాలను బట్టి లీటరుకు రూ.2.09 నుంచి రూ2.35 వరకూ పెరిగాయి. అయితే ప్రస్తుతానికి సాధారణ పెట్రోల్ ధరలు మాత్రం యథాతథంగానే ఉన్నాయి. మెరుగైన ఇంజన్ పనితీరు, మైలేజ్ కోసం వాహనాల్లో ప్రీమియం పెట్రోల్ వాడుతుంటారు.

## 300 బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌పై నిషేధం

న్యూఢిల్లీ, మార్చి 20: దేశంలో పెరుగుతున్న ఆన్‌లైన్ జూదం కార్యకలాపాలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. అక్రమ బెట్టింగ్ ప్లాట్‌ఫారమ్‌లను అరికట్టేందుకు భారీ స్థాయిలో చర్యలు చేపడుతోంది.

కేంద్ర ప్రభుత్వం అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌పై కొరడా ఝుళిపించింది.

300 బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌ను నిషేధించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వీటిలో ఆన్‌లైన్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్, బెట్టింగ్ ఎక్స్ఛేంజీలు, సట్టా/మట్కా గ్యాంబ్లింగ్ నెట్‌వర్క్‌లు, రియల్‌మనీ కార్డ్-కెసినో గేమ్ యాప్స్ ఉన్నాయి.

ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు ఇలాంటి 8,400 వెబ్‌సైట్లు, యాప్స్‌ను నిషేధించింది.

# పైరసీపై కేంద్రం ఉక్కుపాదం.. 3,142 టెలిగ్రామ్ ఛానళ్లకు నోటీసులు, 800 వెబ్‌సైట్ల నిలిపివేత

న్యూఢిల్లీ, మార్చి 20:సినిమా పైరసీని అరికట్టడానికి చట్టపరమైన వ్యవస్థను సినిమాటోగ్రాఫ్ (సవరణ) చట్టం 2023 మరింత బలోపేతం చేసింది. సినిమాటోగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 6ఏఏ, 6ఏబీ ప్రకారం అనుమతి లేకుండా సినిమాలను రికార్డ్ చేయడం, వాటిని ప్రసారం చేయడం నిషేధం. సెక్షన్ 7(1ఏ) ప్రకారం ఎవరైనా ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే వారికి కనీసం 3 నెలల జైలు శిక్ష, రూ. 3 లక్షల జరిమానా విధిస్తారు. నేరం తీవ్రతను బట్టి దీనిని 3 ఏళ్ల జైలు శిక్ష వరకు, అలాగే ఆడిట్ చేసిన స్థూల నిర్మాణ వ్యయంలో 5 శాతం వరకు జరిమానా విధించవచ్చు. ఐటీ చట్టం 2000 లోని సెక్షన్ 79(3) ప్రకారం పైరసీ కంటెంట్ కలిగి ఉన్న లేదా ప్రసారం చేస్తున్న మధ్యవర్తిత్వ సంస్థలకు నోటీసులు ఇచ్చేందుకు సెక్షన్ 7(1బీ)(ఠి) ద్వారా ప్రభుత్వానికి అధికారం ఉంటుంది.

పైరసీని అరికట్టేందుకు 3 నవంబర్ 2023 నాటి బహిరంగ నోటీసులో సూచించిన నిర్దేశిత రూపంలో ఫిర్యాదులను స్వీకరించడానికి నోడల్ అధికారులతో ఒక సంస్థాగత యంత్రాంగాన్ని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. ఇందులో సినిమా అసలు కాపీరైట్ యజమానులు, వారు అధికారం ఇచ్చిన వ్యక్తులు లేదా ఇంటర్నెట్‌లో పైరసీ కాపీల ప్రదర్శన గురించి సమాచారం ఉన్న ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు అందిన వెంటనే.. గుర్తించిన పైరసీ లింకులను నిలిపివేయడానికి సంబంధిత వెబ్‌సైట్లు, సోషల్ మీడియా సంస్థలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తుంది.

చట్టవిరుద్ధమైన చర్యలు లేదా కంటెంట్‌కు సంబంధించి ప్రభుత్వాలు నోటీసు ఇచ్చినప్పుడు, అటువంటి కంటెంట్‌ను తొలగించడానికి ఐటీ చట్టం 2000లోని సెక్షన్ 79(3)(బీ) అవకాశం కల్పిస్తుంది. కోర్టు ఉత్తర్వు ద్వారా లేదా సంబంధిత ప్రభుత్వం, దాని గుర్తింపు పొందిన సంస్థ ద్వారా నోటీసు అందినప్పుడు చట్టాన్ని ఉల్లంఘించే ఏ కంటెంట్‌నైనా మధ్యవర్తిత్వ సంస్థలు దానిని వెంటనే తొలగించాల్సి ఉంటుంది.

ఐటీ చట్టం 2000 కింద సమాచార సాంకేతిక (మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమావళి) నిబంధనలు 2021ని భారత ప్రభుత్వం నోటిఫై చేసింది. సామాజిక మాధ్యమాలతో సహా అన్ని మధ్యవర్తిత్వ సంస్థలు తమ వేదికలపై ప్రదర్శించే, అప్లోడ్ చేసే, ప్రచురించే, ప్రసారం చేసే, నిల్వ చేసే, షేర్ చేసే సమాచారానికి సంబంధించి ఐటీ నియమాలు 2021లోని రెండో భాగం కొన్ని నిర్దిష్ట బాధ్యతలను విధిస్తుంది.

సమాచార సాంకేతిక (మధ్యవర్తుల మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నీతి నియమావళి) నిబంధనలలోని నియమం 3(1)(బీ) ప్రకారం మధ్యవర్తులు తమంతట తాముగా తగిన జాగ్రత్తలు, ప్రయత్నాలు చేయాలి. ఏదైనా పేటెంట్, ట్రేడ్‌మార్క్, కాపీరైట్ లేదా ఇతర యాజమాన్య హక్కులను ఉల్లంఘించే ఎటువంటి సమాచారాన్ని అయినా సరే... కలిగి ఉండటానికి, ప్రదర్శించడానికి, అప్‌లోడ్ చేయడానికి, సవరించడానికి, ప్రచురించడానికి, ప్రసారం చేయడానికి, నిల్వ చేయడానికి, అప్‌డేట్ చేయడానికి లేదా షేర్ చేయడానికి అనుమతి ఉండదు.

పైన పేర్కొన్న చట్టపరమైన నిబంధనల మేరకు ఐటీ చట్టం 2000లోని సెక్షన్ 79(3)(ఏ) ప్రకారం టెలిగ్రామ్ యాప్‌కు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. వివిధ ఓటీటీ వేదికల్లో నిర్మాణ సంస్థలకు చెందిన సమాచారాన్ని ఎలాంటి అనుమతి లేకుండా కాపీరైట్ చట్టం 1957ను ఉల్లంఘిస్తూ ప్రసారం చేస్తున్న 3,142 ఛానళ్లను తక్షణమే తొలగించాలని, వాటికి యాక్సెస్‌ను నిలిపివేయాలని 2026 మార్చి 11న ఆదేశించింది. దీనితో పాటు పైరసీ కంటెంట్‌ను కలిగి ఉన్న సుమారు 800 వెబ్‌సైట్లను ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా ప్రభుత్వం నిలిపివేసింది.

ఈ సమాచారాన్ని సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ నేడు లోక్‌సభలో శ్రీ ప్రద్యుత్ బోర్డోలోయ్‌కు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు.

# విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : డీఎంహెచ్ఓ మనోహర్



నల్గొండ, 20: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి డీఎంహెచ్ఓ మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సుమన్ కళ్యాణ్ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు రిజిస్టర్, ఓపి నమోదు రికార్డులను పరిశీలించారు. సెలవు పెట్టకుండా విధులకు హాజరు కాకపోతే చర్యలు తప్పవన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలన్నారు. దవాఖానలో అందుతున్న వైద్య సేవలపై డాక్టర్ మోజేస్ రాజ్ ను అడిగి తెలుసుకున్నారు.

# ఐఐసీటీ, ఏవీజీసీ - ఎక్స్ఆర్ వ్యవస్థను బలోపేతం చేయడానికి వ్యూహాత్మక భాగస్వామ్యాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం

న్యూఢిల్లీ, మార్చి 20:ప్రభుత్వ ప్రధాన గ్లోబల్ బి2బి మార్కెటింగ్, కార్యకలాపాల వేదికగా చలనచిత్రాలు, యానిమేషన్, విఎఫ్ఎక్స్, గేమింగ్, ఎవిజిసి-ఎక్స్ఆర్, మీడియా, సంగీతం, డిజిటల్ కంటెంట్లో భారత మీడియా, వినోద రంగాన్ని ప్రోత్సహించడానికి వేవ్స్ బజార్ ఏర్పాటయింది. భారత్‌లో సృష్టించండి, ప్రపంచం కోసం సృష్టించండి (క్రియేట్ ఇన్ ఇండియా, క్రియేట్ ఫర్ ది వరల్డ్) కార్యక్రమంగా వేవ్స్ బజార్ రూపుదిద్దుకుంది. భారతీయ ఆవిష్కర్తలు, స్టూడియోలు, స్టార్టప్‌లు, సంస్థల కోసం క్రమబద్ధమైన వ్యాపార గుర్తింపు, మార్కెట్ ప్రవేశం, పెట్టుబడి సదుపాయం, అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని వేవ్స్ బజార్ సుసాధ్యం చేస్తుంది.

యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఏవీజీసీ-ఎక్స్ఆర్) - ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ) కోసం నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్సీఓఈ)కు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం అనేక అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీలతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసింది. ఈ భాగస్వామ్యాలు పాఠ్యాంశాల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన, అభివృద్ధి, స్టార్టప్ ఇంక్యుబేషన్, స్కాలర్‌షిప్‌లు, పరిశ్రమ మార్గదర్శకత్వం ద్వారా ఐఐసీటీకి మద్దతు ఇవ్వడం, తద్వారా దేశంలో ఏవీజీసీ -ఎక్స్ఆర్ వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

దేశాల భాగస్వామ్యం, చలనచిత్ర శైలి, నిర్మాణ శైలి, ఇతివృత్తాలు, ప్రేక్షకుల ఆదరణపరంగా అన్ని అంశాల్లోనూ అందరినీ కలుపుకుని పోవడమే ఐఎఫ్ఎఫ్ఐ లక్ష్యంగా పెట్టుకుంది. గత 3 ఏళ్లలో, ఈ చలనచిత్ర ఉత్సవానికి చిత్రాలను పంపిన దేశాల సంఖ్య 2023లో 106 ఉండగా, 2025 నాటికి అది 127కు పెరిగింది. తుది జాబితాలో ఎంపికైన చిత్రాల పరంగా చూస్తే, అంతర్జాతీయ భాగస్వామ్యం 2023లో 79 దేశాల నుంచి 2025 నాటికి 84 దేశాలకు పెరిగింది.

ఐఎఫ్ఎఫ్ఐ చిత్రాల సమూహంలో కూడా రకాలు, శైలి, ఇతివృత్తాలు గణనీయంగా పెరిగాయి. మరింత మంది పాల్గొనేలా ప్రోత్సహించడానికి, గోవాలోని పంజిమ్, పర్వోరిమ్, మడ్గావ్, పోండా వంటి 4 ప్రాంతాలలో జరుగుతున్న ఈ పూర్తి ఉత్సవానికి ప్రతినిధి రుసుమును తక్కువగా రూ. 1,000/- స్థాయిలోనే ఉంచారు.

# ఆన్‌లైన్ గేమింగ్ ముసాయిదా నిబంధనలు- 2025పై భాగస్వాముల అభిప్రాయాలను ఆహ్వానిస్తోన్న ప్రభుత్వం

న్యూఢిల్లీ, మార్చి 20: దేశంలో సురక్షితమైన, బాధ్యతాయుతమైన, పారదర్శకమైన ఆన్‌లైన్ గేమింగ్ వ్యవస్థ ఉండేలా చూసుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ నేపథ్యంలో ఈ-స్పోర్ట్స్, ఆన్‌లైన్ సామాజిక క్రీడలలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, డబ్బుతో కూడిన ఆన్‌లైన్ ఆటలను (ఆన్‌లైన్ మనీ గేమ్స్) నిషేధించడమే లక్ష్యంగా ప్రభుత్వం 'ఆన్‌లైన్ గేమింగ్ నిరోధక, నియంత్రణ చట్టం- 2025'ను (గేమింగ్ చట్టం) అమలులోకి తెచ్చింది.

ఈ గేమింగ్ చట్టం ఆన్‌లైన్‌లో డబ్బుతో కూడిన అన్ని రకాల ఆటలను సమగ్రంగా నిషేధించింది. అవి అదృష్టంతో కూడినవైనా, నైపుణ్యంతో కూడినవైనా లేదా రెండింటి కలయికతో కూడినవైనా సరే.. వాటిపై పూర్తి నిషేధం ఉంది. ఇటువంటి ఆటల ప్రకటనలు, ప్రచారం, వాటిని ప్రోత్సహించడంపై కూడా నిషేధం ఉంది. బ్యాంకులు లేదా పేమెంట్ సిస్టమ్స్ ద్వారా వీటికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను నిర్వహించడంపై కూడా నిషేధం. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం- 2000 నిబంధనల ప్రకారం చట్టవిరుద్ధమైన ఇటువంటి ప్లాట్‌ఫాంలను బ్లాక్ చేసే అధికారాన్ని కూడా ఈ చట్టం అధికారులకు కల్పిస్తోంది.

నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి అత్యంత కఠినమైన శిక్షలను గేమింగ్ చట్టం విధిస్తుంది. ఆన్‌లైన్‌లో డబ్బులతో కూడిన ఆటలను నిర్వహించడం లేదా వాటికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలకు సహకరించడం వంటి నేరాలకు మూడేళ్ల వరకు జైలు శిక్ష లేదా కోటి రూపాయల వరకు జరిమానా లేదా ఈ రెండూ విధించొచ్చు. రెండోసారి లేదా ఆ తర్వాతి సారి ఇదే నేరానికి పాల్పడితే కనీసం 3 ఏళ్ల నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్ష, కనీసం కోటి రూపాయల నుంచి రెండు కోట్ల రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. ఇటువంటి డబ్బులతో కూడిన ఆన్‌లైన్ ఆటలను ప్రచారం చేయడం శిక్షార్హమైన నేరం. దీనికి రెండేళ్ల వరకు జైలు శిక్ష లేదా 50 లక్షల రూపాయల వరకు జరిమానా లేదా ఈ రెండూ విధించొచ్చు. రెండోసారి లేదా ఆ తర్వాతి సారి ప్రకటనల నియమాన్ని ఉల్లంఘిస్తే కనీసం 2 ఏళ్ల నుంచి 3 ఏళ్ల వరకు జైలు శిక్ష, కనీసం 50 లక్షల రూపాయల నుంచి కోటి రూపాయల వరకు జరిమానా విధిస్తారు.

పైన పేర్కొన్న అంశాలతో పాటు ఈ గేమింగ్ చట్టం ఈ-స్పోర్ట్స్, ఆన్‌లైన్ సామాజిక క్రీడల గుర్తింపు, ప్రోత్సాహానికి కూడా వీలు కల్పిస్తుంది. దీనిలో భాగంగా 'ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా' ఏర్పాటు, ఆన్‌లైన్ గేమ్‌ల కోసం పారదర్శకమైన రిజిస్ట్రేషన్ విధానం, వినియోగదారుల కోసం ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, డబ్బులతో కూడిన నిషేధిత ఆన్‌లైన్ క్రీడల వల్ల కలిగే నష్టాల నుంచి తగిన రక్షణ చర్యలను ఈ చట్టం కలిగి ఉంది.

అనుమతించదగిన క్రీడలను వర్గీకరించడం, రిజిస్టర్ చేయడం.. ఏదైనా ఒక ఆట 'డబ్బులతో కూడిన ఆట' పరిధిలోకి వస్తుందో లేదో నిర్ణయించడం, ప్రవర్తనా నియమావళిని జారీ చేయడం, ప్రజల ఫిర్యాదులను పరిష్కరించడం వంటి బాధ్యతలను జాతీయ స్థాయి 'ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ' నిర్వహిస్తుంది. ఒక కేంద్ర నియంత్రణ సంస్థకు అధికారాలను కల్పించడం ద్వారా సమన్వయంతో కూడిన విధానపరమైన మద్దతును అందించడం, సమర్థవంతమైన పర్యవేక్షణను చేపట్టడం, ఆన్‌లైన్ గేమింగ్ రంగంలో భారతదేశాన్ని ప్రపంచ నాయకత్వ స్థానంలో నిలబెట్టాలన్నది ఈ చట్టానికి ఉన్న ముఖ్య ఉద్దేశం. సాంకేతిక వృద్ధి జాతీయ ప్రయోజనాలకు, వినియోగదారుల రక్షణ సూత్రాలకు అనుగుణంగా ఉండేలా ఈ చట్టం చూసుకుంటుంది.

గేమింగ్ చట్టాన్ని కార్యరూపంలోకి తీసుకురావడానికి కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ 2025 అక్టోబర్ 2న 'ఆన్‌లైన్ గేమింగ్ ప్రోత్సాహం, నియంత్రణ ముసాయిదా నిబంధనలు- 2025'ను బహిరంగ సంప్రదింపుల కోసం విడుదల చేసింది. చట్టాల రూపకల్పనలో అందరినీ భాగస్వాములను చేయాలనే ప్రభుత్వ నిశ్చయానికి అనుగుణంగా భాగస్వాములతో సహా ప్రజలందరి నుంచి అభిప్రాయాలు, సూచనలను ఆహ్వానిస్తోంది.

ఈ రోజు లోక్‌సభలో శ్రీ రావు రాజేంద్ర సింగ్ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంగా సమాచార- ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ఈ సమాచారాన్ని సమర్పించారు.

# ఆకలితో అలమటిస్తున్న పేదల ఆకలి తీర్చడం ఎంతో గొప్ప పుణ్యం : తలసాని

హైదరాబాద్, మార్చి 20: తినడానికి తిండిలేక ఆకలితో అలమటిస్తున్న అనేకమంది పేదల ఆకలి తీర్చడం ఎంతో గొప్ప పుణ్య కార్యమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్ నగర్‌లోని బీకే గూడ పార్క్ వద్ద శ్రీనివాస సమాజసేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పంపిణీ, చలి వేంద్రాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు.



అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 2011 నుంచి ప్రతి సంవత్సరం వేసవి కాలంలో సుమారు 70 రోజులపాటు ఎంతో రుచికరమైన భోజనాన్ని పేదలకు అందిస్తూ వస్తున్నామని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా తమ వయసును లెక్కచేయకుండా సమాజానికి సేవ చేయాలనే సీనియర్ సిటిజన్‌ల లక్ష్యాన్ని ఆయన అభినందించారు. రాష్ట్రంలో అనేకమంది సీనియర్ సిటిజన్లు ఉన్నప్పటికీ సనత్‌నగర్‌లోని సీనియర్ సిటిజనలు తమ సామాజిక సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలిచారని అన్నారు.

కుటుంబ బాధ్యలతో గడపాల్సిన సమయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప సంకల్పమని చెప్పారు. ఇక్కడ భోజనం తిని ఆకలి తీర్చుకుంటున్న పేదలు తమ జీవితాంతం గుర్తుపెట్టుకుంటారని అన్నారు. తమ సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్న సీనియర్ సిటిజన్‌లు జీవితాంతం నా గుండెల్లో ఉంటారని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. వయసులో నా కంటే పెద్దవారైన మీ ఆశీస్సులు నాపై ఉండాలని వారిని కోరారు. తనను కలవడానికి వచ్చినప్పుడు శాలువాల కోసం డబ్బు వృథా చేయవద్దని అన్నారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో ఆరోగ్య రీత్యా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# కుంభకోణాల కోసమే ఈ బడ్జెట్.. ప్రజాప్రయోజనం ఏదీ లేదు : మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 20:బడ్జెట్ మొత్తం మోసమని, అన్ని వర్గాల ప్రజల చెవిలో కాంగ్రెస్ ప్రభుత్వం పువ్వులు పెట్టిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి విమర్శించారు. బడ్జెట్ మొత్తంలో ఎక్కడ కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే అంశమే లేదన్నారు. ఆరు గ్యారంటీల ఊసే తీయలేదని మండిపడ్డారు. కేవలం కుంభకోణాల కోసమే కాంగ్రెస్ సర్కారోళ్లు ఈ బడ్జెట్ పెట్టుకున్నరని ఆరోపించారు.

నిరుద్యోగ సమస్య, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై బడ్జెట్‌లో ఎలాంటి అంశం లేదని విమర్శించారు. రైతు భరోసాను ఇచ్చిన మాట ప్రకారం ఈ సారైనా ఎకరానికి రూ.15 వేలకు పెంచుతారని ఆశించామని, కానీ ఊసే తీయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆఖరికి ఆ రూ.12 వేల చొప్పున కూడా ఎప్పుడు ఇస్తారో చెప్పలేదని ధ్వజమెత్తారు. రైతులకు ఏడాదికి రూ.12 వేల అంశం కూడా ఉత్తమాటగానే మిగిలిపోయిందని విమర్శించారు.

ఇక మహిళకు నెలకు రూ.2500 ఇస్తామని ఎన్నికల సందర్భంగా రేవంత్‌రెడ్డితోసహా కాంగ్రెస్ నేతలు జోరుగా ప్రచారం చేశారని, కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతున్నా ఆ హామీని నెరవేర్చలేదని జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇది ఆడబిడ్డలను దగా చేయడమేనని మండిపడ్డారు. వృద్ధ్యాప్య పింఛన్‌లు, వికలాంగ పింఛన్‌ల విషయంలో కూడా ప్రభుత్వం మాటతప్పిందని విమర్శించారు. వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులు రూ.6 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆగ్రహించారు.

# గుర్రంపోడులో వేంకటేశ్వర స్వామి 9వ వార్షికోత్సవం ప్రారంభం



నల్గొండ, 20: గుర్రంపోడు మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి తొమ్మిదో వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి గాలి రవికుమార్ గౌడ్, ఆలయ చైర్మన్ జాల పెద్ద సత్తయ్య యాదవ్, సర్పంచ్ జాల యాదయ్య మాట్లాడుతూ.. స్వామివారి వార్షికోత్సవ వేడుకను గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలన్నారు. నేడు జరిగే స్వామి వారి కల్యాణానికి ప్రతి ఒక్కరు హాజరై వీక్షించాలని కోరారు. ఆదివారం బొడ్రాయి వార్షికోత్సవం ఉన్నందున గ్రామ ప్రజలందరూ స్వామివారికి నైవేద్యాలు సమర్పించి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు వట్టికోడు శ్రీనివాస శర్మ, మోపోజ్ కిరణాచార్యులు, వైస్ చైర్మన్ వెలుగు భిక్షం, కమిటీ సభ్యులు రావుల సైదులు గౌడ్, తడకమళ్ల అంజయ్య, మేడి వెంకన్న, పోలేపల్లి భద్రయ్య, వెలుగు జలంధర్, గంగసాని యాదయ్య, మోపురి మురళి, పోలేపల్లి నరసింహ, మోపురి ఆచారి, జాల నరసింహ, తగుల యాదయ్య, తగుల వెంకటయ్య, వంగూరి రమేశ్ పాల్గొన్నారు.

# విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ భువనగిరి డివిజన్ చైర్మన్‌గా మహేశ్

నల్గొండ, 20: రాజాపేట మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన ఇంజ మహేశ్‌ను విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ భువనగిరి డివిజన్ చైర్మన్‌గా ఎంపిక చేసినట్లు టీజీ ఎస్పీడీసీఎల్ కంపెనీ కో చైర్మన్ బొక్క పాండర్ రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా కో చైర్మన్ భాస్కర్ నాయక్ శుక్రవారం తెలిపారు. కన్వీనర్‌గా బొట్ల రమేశ్, కో చైర్మన్ ఎడ్ల వెంకటేశ్, వైస్ చైర్మన్‌గా సాహిని రమేశ్ ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర చైర్మన్‌కు ఈ సందర్భంగా వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# ఈద్-ఉల్-ఫితర్



ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ సంపూర్ణంగా అవతరించిన మాసం రంజాన్. రంజాన్ మాసంను ముస్లింలు ఎంతో పవిత్రంగా భావిస్తారు.

నెలవంకతో ప్రారంభమైన రంజాన్ మాసం.. మళ్లీ నెలవంక రాకతోనే ముగుస్తుంది. రంజాన్ ముగింపులో భాగంగా 'ఈద్ ఉల్ ఫితర్' పండుగను నిర్వహిస్తారు. రంజాన్ నెలలో 29 లేదా 30వ రోజు ఆకాశంలో చంద్ర దర్శనం చేసుకుంటారు. మరుసటి రోజు ఈద్ జరుపు కుంటారు. నిజానికి ఈ రోజు 10 నెల షవ్వాల్ కు మొదటి రోజు. షవ్వాల్ నెలలో మొదటి రోజైన ఈద్-ఉల్-ఫితర్ నాడు ముస్లింలు ఉపవాసం చేయకూడ దనేది ఆచారం.

ఇస్లామియ దేశాలలో, ముస్లింల సముదాయాలలో అవలంబింప బడుతున్న కేలండర్ చంద్ర మాసాలపై ఆధారంగా గలది. దీన్ని 'తఖ్వీమ్-హిజ్రి-ఖమరి' అని కూడా అంటారు. ఈ కేలండర్ లో 12 చంద్ర మాసాలు, దాదాపు 354 దినాలు గలవు.

హిజ్రీ శకానికి మూలం ముహమ్మద్ ప్రవక్త సంబంధిత హిజ్రా, హిజ్రాహ్ లేదా హిజ్రత్. మహమ్మదు ప్రవక్త , ఆయన అనుయాయులు మక్కా నుండి మదీనా కు క్రీ.శ. 622 లో వలస వెళ్ళారు. ఈ వలస వెళ్ళడాన్నే హిజ్రత్ అని అంటారు.

క్రీ. శ. 622. సెప్టెంబరు లో మహమ్మదు ప్రవక్త తమ అనుయాయులతో కలసి హిజ్రత్ (వలస) 'యస్రిబ్' నగరాన్ని చేరు కొన్నట్లు చెపుతారు. యస్రిబ్ నగరానికి మదీనా లేదా "మదీనతున్ - నబీ" లేదా నబీ (ప్రవక్త) యొక్క నగరంగా పేరు స్థిర పడింది. అలా ముస్లింల శకం హిజ్రీ ప్రారంభ మయినట్లు, ఉమర్ కాలంలో 638లో ఇస్లామియ కేలండర్ ప్రారంభమయినట్లు చెపుతారు.

మహమ్మదు ప్రవక్త వలస . క్రీ. శ.622 సెప్టెంబరు 9 నాడు

మక్కానగరం లోని తమ ఇంటిని వదిలి, మక్కాకు దగ్గరలోని తూర్ గుహలో మూడు రోజులు గడిపి, 622న సెప్టెంబరు 23న

మక్కా పొలిమేరలు దాటి, యస్రిబ్ ప్రాంతానికి పయనమైనారు. సెప్టెంబరు 20న మదీనా దగ్గరలోని "ఖుబా" ప్రాంతానికి చేరుకున్నారు ....24 సెప్టెంబరు 34న ఖుబా నుండి మదీనా ప్రయాణం సాగించి, శుక్రవారపు ప్రార్థనలు జరిపారు. 622 అక్టోబరు 4న మదీనా మొదటి దర్శనం జరిగినట్లు తెలుస్తోంది.

హిజ్రీ ప్రారంభం మొహర్రం నెలలో కాకుండా, ఇస్లామియ కేలండరు లోని మూడవనెల అయిన రబీఉల్ అవ్వల్ నెలలో హిజ్రత్ జరిగింది. అంటే హిజ్రీ శకం, హి.శ. 1 లోని మూడవ నెల అయిన రబీఉల్ అవ్వల్ 22 వ తేదీన ప్రారంభం అవుతుంది.

ఇస్లాం క్యాలెండర్‌లోని హిజ్రీ నెల స్థానిక చంద్రోదయంపై ఆధారపడి వుండడంతో మతపెద్దలు నెలవంక కనిపించగానే ఈద్ ఉల్ ఫితర్ ప్రకటిస్తారు.

ఈద్ అసలు పేరు ఈద్-ఉల్-ఫితర్. ఫితర్ లేదా ఫిత్రా పదానికి అర్థం... మానవునిలో గల ప్రాకృతిక ధర్మం ప్రాతిపదికగా తనతో పాటు ఇతరులకూ సంతోషాన్నివ్వడం. ఈ ధర్మం ప్రకారం భాగ్యము లేని పేద వారికి, ధన రూపేణా భాగ్యము కల్పించడం.

ఈ ఫిత్రా రంజాన్ పండుగ సందర్భంగా, పేదలకు, అభాగ్యులకు ఇచ్చే దానం. ప్రతి ముస్లిం ఇవ్వవలసిన కనీస దానం. ఈ దానం, రంజాన్ పండుగకు మూడు రోజుల ముందు నుండి ఇవ్వవచ్చును. అలా ఇచ్చినపుడు, పేదలూ సంతోషంగా పండుగ చేసుకునే వాతావరణం ఏర్పడుతుంది. దేవుడి పట్ల కృతజ్ఞతగా ... పేదలకు దానం చేసే ఈవిధానంలో గోధుమలు గానీ , ఆహార ధాన్యాలను గానీ, ధనాన్ని గానీ పంచిపెడతారు. ఈ దానం కుటుంబంలోని సభ్యులందరి తరపున పేదలకు అందజేస్తారు.

చంద్ర దర్శనానంతరం చిన్నవారు, పెద్దలకు నమస్కరిస్తారు, శుభాశీస్సులు పొందుతారు. పండుగ రోజున సాధారణంగా ఈద్ ముబారక్, ఈద్ సద్ అని శుభాకాంక్షలు ఒకరికొకరు చెప్పుకుంటారు.

ఈద్ నాడు స్నానానంతరం నూతన వస్త్రాలను ధరిస్తారు. పురుషులు మసీదుకు, ఈద్గాహకు వెళ్ళి, చిన్న పెద్ద, ధనిక పేద, తరతమ భేదాలు లేక వరుసలో నిలబడి నమాజు పఠిస్తారు.

ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపు కుంటారు. ఇళ్ళలో పాయసం తదితర పిండి వంటలు భుజిస్తారు. స్నేహితులకు, బంధువులకు కట్న కానుకలను సమర్పించు కుంటారు. పేదలకు దానాలు చేసారు. రంజాన్ నెలలో చేసే దానాలను 'జకాత్' అంటారు.

రంజాన్ మాసం భక్తి శ్రద్ధలకు, పవిత్రతకు, నియమాలకు ప్రతీక. ఏకాగ్రతతో ఆత్మసాక్షాత్కారార్థమై, పాపములు తొలుగుటకు, లౌకిక విషయాలను పక్కనపెట్టి, పారమార్థిక విషయాలపై దృష్టి సాధించేందుకు కఠోర నియమాలను పాటించాల్సి ఉంటుంది.

రంజాన్ సందర్భంగా నెలరోజుల పాటు ఉపవాస దీక్ష తో పాటు, నియమిత వేళలో భుజిస్తూ దీక్షను స్వీకరించేవారు దైవ భక్తి, ఆత్మ సంయమనంతో పాటు, ఆరోగ్య వంతులుగా ఉండగలరనేది నిర్వివాదాంశం.

పవిత్ర మాసంలో ఉపవాసాలు, దీక్షలు, ఆధ్యాత్మిక చింతన, దానాలు, ధర్మాలు చేపడుతూ, నెల రోజులు దీక్షా దక్షులు అయిన ముస్లిం సోదరులు పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపు కునేందుకు ఉద్యుక్తులు అవుతున్నారు.



**-రామ కిష్టయ్య**
**సంగన భట్ల,**
9440595494

# రంజాన్ పండుగ ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక

## -రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




రాజన్న సిరిసిల్ల, మార్చి 20: నేటినిజం (ప్రతినిధి): రంజాన్ పండుగ ప్రేమ,శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆది శ్రీనివాస్ ఉపవాస దీక్షలో పాటించే ముస్లిం సోదరులకు ఖర్జూర పండ్లు , డ్రై ఫ్రూట్స్ ఏర్పాటు చేసి రోజాను విరమింప చేశారు. స్థానిక ముస్లిం సోదరులతో, మత పెద్దలతో కలిసి ఆయన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముందుగా ఆది శ్రీనివాస్ కు పూలమాలలతో శాలువతో ఇస్లామియ సాంప్రదాయబద్ధంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ సాబీర్, మహమ్మదీ మజీద్ అధ్యక్షులు షేకి ఇ మామ్ మైనార్టీ నాయకులు సయ్యద్ సాబిర్, పీర్ మొహమ్మద్ అబ్దుల్ రజాక్, సర్వర్ బాబును షాహిద్ ఆత్మీయ సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రంజాన్ మాసం త్యాగం, సహనం, దయ, సమానత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో పరస్పర గౌరవం, సౌభ్రాతృత్వం పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ, మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతి, సామరస్య వాతావరణాన్ని కాపాడటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, వైస్ కనికరపు రాకేష్ , కౌన్సిలర్ లు తుమ మధు, అన్నారం శ్రీనివాస్, ఇప్ప పుల్ల అజయ్, కొండ శేఖర్, తోటరాజు, షేక్ సాబీర్, మస్జిద్ కమిటీ అధ్యక్షులు షేకిఇ మామ్, సర్వర్ పాషా బషీర్, రజాక్, నవాబ్ ఖాన్, కరీం ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి రైతు సంఘం ఆధ్వర్యంలో ఉత్సాహంగా సాగు పండుగ



రాజన్న సిరిసిల్ల, మార్చి 20: నేటినిజం (ప్రతినిధి): తెలుగువారి నూతన సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రాజన్న క్షేత్రం వేములవాడ పట్టణంలో ఏరువాక కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పట్టణంలోని 4వ వార్డులో గల మహాలక్ష్మి రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో మున్సిపల్ చైర్మన్ పుల్కాం రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా నాగలి పట్టి, ఎడ్లను నడిపిస్తూ భూమిని దున్ని సాగు పనులను లాంఛనంగా ప్రారంభించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని పేర్కొన్న ఆయన, ప్రకృతి ఆరాధనే ఏరువాక అని కొనియాడారు. ఏరు అంటే నాగలి అని, వాక అంటే ప్రారంభమని అర్థమని వివరిస్తూ, ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో రాబోయే వర్షాకాలం కోసం భూమిని సిద్ధం చేసే ఈ పవిత్ర కార్యం మన సంస్కృతిలో ఒక భాగమని అన్నారు. రైతులు తమ జీవనాధారమైన పశువులను, నాగలిని పూజించి, భూమాతకు నైవేద్యం సమర్పించి తొలి దుక్కి దున్నడం ఒక మంచి ఆనవాయితీగా వస్తోందని ఆయన గుర్తుచేశారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని కోరుకుంటూ సామూహికంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వకారణమని చైర్మన్ అన్నారు. వేములవాడ పుణ్యక్షేత్ర పరిధిలో భక్తి భావంతో పాటు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వ్యవసాయం పట్ల ఉన్న మక్కువను, ఐక్యతను చాటుతోందని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చెర్మన్ రొండి రాజు, వైస్ చెర్మెన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు తోట రాజు, కొక్కుల బాలకృష్ణ, కొండ రాజశేఖర్, తుం మధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహాలక్ష్మి రైతు సంఘం ప్రతినిధులు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏరువాక సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.

# సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించాలి.. రాజన్న ఆలయ ఈవో రమాదేవి



రాజన్న సిరిసిల్ల, మార్చి 20: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలో జరిగే సీతారాముల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించాలని ఈవో రమాదేవి అన్నారు. ఈ నెల 27న జరగనున్న సీతారాముల కళ్యాణం సందర్భంగా ఆలయ అధికారు లతో ఆమె శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజన్న క్షేత్రంలో జరిగే సీతారా ముల కళ్యాణానికి సుమారు మూడు నుంచి నాలుగు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఈ సందర్భంగా భారీగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. భక్తులకు సులభంగా దర్శనం అయ్యే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఎండలు కూడా మండుతున్నందున వారి అవసరాలకు అనుగుణంగా తాగు నీరు సదుపాయాలను ఎక్కడికక్కడ కల్పించాలన్నారు. పార్కింగ్ పై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భక్తులకు అవసరమయ్యే ప్రసాదాలను కూడా తయారు చేయాలన్నారు. పటిష్టమైన భద్రత కల్పించే విధంగా చూడాలన్నారు.

భక్తులు సౌకర్యవంతంగా స్వామివారిని దర్శించుకునేలా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఈవో ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఏఈవోలు శ్రవణ్ కుమార్, అశో క్, జయ కుమారి, డీఈ రఘున ందన్, పర్యవేక్షకులు రాధా, వెల్ది సంతోష్, భీమేశ్వర శర్మ, శ్రీనివాస శర్మ, భాస్కర్, రాజేందర్, నరేం దర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కొనుగోలులో స్మార్ట్ వ్యూహం- డేటా ఆధారంతో ఖర్చులకు కళ్లెం- తెలంగాణ డిస్కంలకు రూ. 700 కోట్ల లాభం

హైదరాబాద్, మార్చి 20: సంప్రదాయ విద్యుత్ కొనుగోలు పద్ధతులకు తెలంగాణ స్వస్తి పలికింది. అత్యాధునిక డేటా ఆధారిత వ్యూహాలతో విద్యుత్ కొనుగోలులో రూ. 700 కోట్ల భారీ పొదుపును సాధించింది. సోలార్, హైడ్రో వంటి పునరుత్పాదక ఇంధన వనరుల లభ్యత పెరగడం, పవర్ ఎక్స్ఛేంజీలలో ధరలు తగ్గడాన్ని అనుకూలంగా మార్చుకొని 2026 ఆర్థిక సంవత్సరం మొదటి 11 నెలల్లోనే ఈ మైలురాయిని చేరుకుంది. ఒకప్పుడు కేవలం అత్యవసరాలకే పరిమితమైన విద్యుత్ మార్కెట్లను, ఇప్పుడు వ్యూహాత్మక లాభాల కోసం తెలంగాణ సమర్థవంతంగా వినియోగిస్తోంది.

భారతదేశ విద్యుత్ కొనుగోలు రంగంలో నిర్మాణాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్ర విద్యుత్ సంస్థలు (డిస్కంలు) తమ సాధారణ విద్యుత్ సరఫరా ప్రణాళికలో 'పవర్ ఎక్స్ఛేంజీలను' (విద్యుత్ మార్కెట్లను) ఎక్కువగా భాగం చేస్తున్నాయి. ఒకప్పుడు కేవలం విద్యుత్ కొరతను లేదా అనూహ్యమైన డిమాండ్‌ను తట్టుకోవడానికి స్వల్పకాలిక పరిష్కారంగా మాత్రమే వీటిని ఉపయోగించేవారు. ఇప్పుడు ధరలు, విద్యుత్ ఉత్పత్తి ఆర్థికాంశాలు, సమయాన్ని బట్టి మారే డిమాండ్ సరళిని విశ్లేషిస్తూ.. డేటా ఆధారిత వ్యూహాలతో విద్యుత్ కొనుగోలు చేయడానికి వీటిని ఒక ప్రధాన మార్గంగా మారుస్తున్నారు.

ఈ మార్పు డిస్కంల నిర్ణయాధికారంలోని మూడు కీలక అంశాలను సానుకూలంగా ప్రభావితం చేస్తోంది. అవి.. విద్యుత్ కొనుగోలు చేసే సమయం, రాష్ట్రానికి కేటాయించిన విద్యుత్ ఉత్పత్తిని షెడ్యూల్ చేసే విధానం, రోజువారీ డిమాండ్-సరఫరా సమతుల్యతను మెరుగుపరచడం. మార్కెట్ ఆధారిత డైనమిక్ కొనుగోలు పద్ధతులు ఒక కార్యాచరణ వ్యూహంగా ఎలా స్థిరపడుతున్నాయో? తెలంగాణ ఇటీవల అనుసరించిన విద్యుత్ కొనుగోలు ధోరణులు స్పష్టం చేస్తున్నాయి. సౌర, జల, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరుల లభ్యత పెరగడం, స్థిరమైన బొగ్గు విద్యుత్ ఉత్పత్తి కారణంగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 11 నెలల్లో మార్కెట్, రియల్-టైమ్ మార్కెట్ ధరలలో గణనీయమైన తగ్గుదల నమోదైంది.

# కరీంనగర్‌లో సైక్లింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక




కరీంనగర్, మార్చి 20: (నేటినిజం ప్రతినిధి) రాజన్న సిరిసిల్ల జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో మొత్తం కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. స్థానిక వావిలాలపల్లి ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమంలో చైర్మన్ డా. వి. నరేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. సైక్లింగ్ క్రీడకు ప్రత్యేకత ఉందని, ఈ క్రీడకు విస్తృత ప్రచారం అవసరమని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సాధించిందని, అనేక టోర్నమెంట్లు నిర్వహించి క్రీడా స్ఫూర్తిని పెంపొందించిందని తెలిపారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమాలకు కూడా జిల్లా సంఘం చేయూతనిచ్చిందని చెప్పారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు డా. కెప్టెన్ బి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, వివిధ స్థాయిల పోటీలను విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. 2022 నుంచి 2026 వరకు క్రీడాభివృద్ధికి ఆదర్శ కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నికలకు రాష్ట్ర స్థాయి పర్యవేక్షకులు ఏ. కిషన్, జిల్లా యువజన క్రీడ విభాగానికి చెందిన పవన్, ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి జనార్దన్ రెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరించారు. మాజీ కార్పొరేటర్ టి. రమేష్ రెడ్డి రిటర్నింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా డా. కెప్టెన్ బి. మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సురభి వేణుగోపాల్, కోశాధికారిగా విజగదీశ్వర చారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం. అరవింద్, ఎస్. రాజయ్య, ఎస్. అనుదీప్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్. ఇంద్రవేశ్, వి. రమేష్, జై నరేష్ తదితరులు ఎన్నికయ్యారు.

# గోదావరిలో మునిగి ఐదుగురు గల్లంతు

ఖమ్మం, మార్చి 20:భద్రాచలం శివారులో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి వెళ్లిన యువకుల్లో ఐదుగురు గల్లంతు కావడంతో స్థానికంగా తీవ్ర ఆందోళన నెలకొంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పురుషోత్తమపట్నం పంచాయతీ పరిధిలోని కొల్లుగూడెం సమీపంలో ఈ ఘటన జరిగింది. భద్రాచలం పట్టణానికి చెందిన ఏడుగురు గోదావరిలో స్నానానికి వెళ్లగా, వారిలో ఐదుగురు లోతు తెలియక నదిలో మునిగిపోయినట్లు సమాచారం.ఒడ్డున ఉన్న ఇద్దరు వెంటనే డయల్ 100కు సమాచారం అందించగా, పోలీసులు అప్రమత్త మయ్యారు. ఘటన స్థలం ఆంధ్ర ప్రదేశ్ పరిధిలో ఉండటంతో భద్రాచలం పోలీసులు ఎటపాక పోలీసులకు సమాచారం ఇచ్చారు.

భద్రాచలం, ఎటపాక పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గల్లంతైన వారిలో కొందరు రామాలయంలో పనిచేసే ఉద్యోగుల పిల్లలు ఉన్నట్లు సమాచారం. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. భద్రాచలం అనుకోని వున్న కూనవరం రోడ్లో ఆంధ్రప్రదేశ్ పరిధిలోని కొల్లుగూడెం సమీపంలో భద్రాచలం పట్టణానికి చెందిన ఓ ఏడుగురు నది స్నానం కోసం వెళ్ళారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో గోదావరి లోతుపై అవగాహన లేక ఐదుగురు గల్లంతైన సంఘటన చోటుచేసుకుంది. మిగిలిన ఇద్దరు స్నేహితులు మునిగిపోతున్న వారిని గుర్తించి భద్రాచలం పోలీసులకు సమాచారం తెలిపారు.

సంఘటన ప్రాంతం ఆంధ్ర పరిధిలో ఉండటంతో భద్రాచలం పోలీసులు ఎటపాక పోలీసు స్టేషన్కు తెలిపారు. భద్రాచలం, ఎటపాక పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటన పై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### ముగ్గురి మృతదేహాలు స్వాధీనం..

భద్రాచలం-వేలేరు వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగి అమరావతి ఎస్ఆర్ఎం కాలేజీకి చెందిన ఐదుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు గల్లంతైన విషయం తెలిసిందే. గల్లంతైన వారిలో ముగ్గురి మృతదేహాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. సతీశ్ (మదనపల్లి), నవదీప్ (ఉయ్యూరు), తేజజ్ఞ (ఉయ్యూరు), శ్రీకర్ (భద్రాచలం), అభిరామ్ (విజయనగరం) అనే విద్యార్థులు గల్లంతైన విషయం తెలిసిందే. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బోధన్‌లో పట్టపగలే చోరీ.. రహదారి పక్కనున్న కారు అద్దాలు పగులగొట్టి నగదు చోరీ

నిజామాబాద్, మార్చి 20: బోధన్ పట్టణంలో పట్టపగలే ప్రధాన రహదారిలో నిలిపించిన కారు అద్దాలు పగలగొట్టి నగదు చోరీ జరిగిన సంఘటన బోధన్ పట్టణంలో సంచలనమైంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. బోధన్ మండలం జాడి జమాల్పూర్ గ్రామానికి చెందిన హరిబాబు అనే వ్యక్తి తాను కొనుగోలు చేసిన భూమికి డబ్బులు చెల్లించాల్సి ఉంది. కాగా ఆ డబ్బులను తన బ్యాంకు ఖాతాలను విత్ డ్రా చేసేందుకు బోధన్ కు వచ్చాడు.

ఈ క్రమంలో రుద్రూర్ వెళ్లే రహదారి పక్కన ఉన్న కెనరా బ్యాంక్ నుంచి రూ.3 లక్షలు విత్ డ్రా చేసుకొని వాటిని ఓ కవర్లో పెట్టి కార్లో గోశాల రోడ్ లోని ఇండియన్ బ్యాంకు వద్దకు వచ్చాడు. కారు బ్యాంకు సమీపం లో రోడ్డు పక్కగా నిలిపి సదరు బ్యాంకు నుంచి మరికొన్ని డబ్బులు తీసుకుని వచ్చేలోపు, తన కారు అద్దాలు పగలగొట్టి ఉండడం గుర్తించి డబ్బుతో ఉన్న కవర్ పరిశీలించాడు.

అది కనిపించక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సదరు వ్యక్తి బ్యాంకు నుంచి డబ్బులు విత్ డ్రా చేయడం గుర్తించిన వ్యక్తులే వెన్నంటి వచ్చి ఈ చోరీకి పాల్పడి ఉంటారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ వెల్లడించారు. బోధన్ పట్టణంలో పట్టపగలే దుండగులు చోరీ జరపడం చర్చనీయాంశంగా మారింది.

# "యుద్ధ ప్రభావిత ప్రాంతాల నుంచి భారతీయులను తరలించేందుకు 'మిషన్ మోడ్'లో పనిచేస్తున్న భారత మిషన్లు



హైదరాబాద్, మార్చి 20:పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య, భారత ప్రభుత్వం మరియు విదేశాల్లోని భారత మిషన్లు భారతీయ పౌరులను సురక్షితంగా తరలించేందుకు చురుకుగా చర్యలు తీసుకుంటున్నాయి. వారి తిరిగి రాకను సులభతరం చేయడానికి పలు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగిస్తున్నారు.

విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రకారం, ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ ఘర్షణ తరువాత ఇప్పటివరకు సుమారు 2,44,000 మంది భారతీయులు సురక్షితంగా దేశానికి తిరిగి వచ్చారు. యుద్ధ ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని తిరిగి తీసుకురావడానికి, భారత ప్రభుత్వం పశ్చిమ ఆసియా మరియు మధ్యప్రాచ్యంలోని ప్రముఖ నాయకత్వంతో సన్నిహితంగా సంప్రదింపులు కొనసాగిస్తోంది. ఇదే సమయంలో విదేశాల్లోని భారత మిషన్లు పూర్తిగా 'మిషన్ మోడ్'లో పనిచేస్తున్నాయి. మార్చి 17న జరిగిన అంతర-మంత్రిత్వ శాఖ సమావేశంలో మాట్లాడుతూ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రంధీర్ జైస్వాల్ తెలిపారు ??, ఇరాన్ నుంచి భూభాగ మార్గాల ద్వారా సుమారు 700 మంది భారతీయులు ఆర్మేనియా మరియు అజర్‌బైజాన్‌కు చేరుకుని, అక్కడి నుంచి భారత్‌కు తిరిగి వస్తున్నారు. ఆయన ఇంకా తెలిపారు, "ఇరాన్‌కు వెళ్లిన మొత్తం 284 మంది యాత్రికులు కూడా సురక్షితంగా ఆర్మేనియాకు చేరుకున్నారు. వీరిలో 130 మంది యాత్రికులు ఈరోజే ఢిల్లీకి చేరుకుంటారు." అలాగే ఓఇం కంట్రోల్ రూమ్ పూర్తిగా పనిచేస్తోందని, పౌరులకు సహాయం అందిస్తున్నదని, వచ్చిన కాల్స్ మరియు ఇమెయిల్స్ సంఖ్య గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు.

# ఇంద్రియ, ఆదిత్య బిర్లా జ్యువెల్లరీ గుంటూరులో నూతన స్టోర్ ప్రారంభం



హైదరాబాద్, మార్చి 20:ఇంద్రియ-ఆదిత్య బిర్లా జ్యువెలరీ, గుంటూరులోని లక్ష్మీపురంలో తన కొత్త స్టోర్‌ను ప్రారంభిస్తూ దేశవ్యాప్తంగా తన విస్తరణను కొనసాగిస్తోంది. ఈ ప్రారంభం ఆంధ్రప్రదేశ్‌లో బ్రాండ్ విస్తరణకు సంకేతంగా మరో మైలురాయిని చేరుకుంది . తన ప్రత్యేకమైన ఆభరణాల రిటైల్‌ను వినియోగదారులకు చేరువైనది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సందీప్ కోహ్లీ, సీఈవో, ఇంద్రియా ఇలా అన్నారు,"బలమైన సాంస్కృతిక మూలాలు మరియు అందంగా రూపొందించిన ఆభరణాలకు లోతైన ప్రశంసలకు ప్రసిద్ధి చెందిన నగరమైన గుంటూరుకు ఇంద్రియ-ఆదిత్య బిర్లా జ్యువెలరీని తీసుకురావడం మాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు . వివాహాలు, పండుగలు, కుటుంబ వేడుకల సందర్భాలలో ఆభరణాలు కొనుగోలు చేసే బలమైన సంప్రదాయంతో గుంటూరు, నగరంలోని ప్రధాన రిటైల్ ప్రాంతాలలో ఒకటైన లక్ష్మీపురం, గుంటూరులో ఉన్న ఆకర్షణీయమైన నూతన స్టోర్ వినియోగదారులకు అనుకూలమైన గమ్యస్థానంగా నిలుస్తుంది. ఇంద్రియ-ఆదిత్య బిర్లా జ్యువెలరీ యొక్క శాశ్వతమైన హస్తకళ ఆధునిక రూపకల్పనల సమ్మేళనం గుంటూరు నగరానికి ప్రత్యేకమైన సంప్రదాయం, అభివృద్ధి వేగాన్ని ప్రతిబింబిస్తుంది.


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com